సమస్త ప్రక్షాళనం

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

ప్రచురణ : సంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 135, ఎడిటర్ : జె. భాస్కర్, శనివారం 13-06-2026 పేజీలు : 12 వెల : 2/-



### తెలంగాణకు వచ్చివెళ్లేందుకు... పోటీ చేసేందుకు

# పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది




- మీనాక్షి నటరాజన్ వ్యవహారంలో ఆర్వో బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారన్న సీఎం
- బీజేపీ నేతలు కిమ్ జాంగ్‌లాగే ప్రవర్తిస్తున్నారని విమర్శ
- ఓట్ చోరీ లేకుంటే సీట్ చోరీ మాత్రమే బీజేపీకి తెలుసని విమర్శ

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ, తెలంగాణలో పవన్ కల్యాణ్ పర్యటన, పోటీ సహా బీజేపీ నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద ఎటువంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. తనకు హిట్లర్ స్ఫూర్తిని జరుగుతున్న ప్రచారంపై స్పష్టత నిచ్చారు. ఇప్పటి వరకు బీజేపీ ఓటు చోరీ మాత్రమే చేసిందని, ఇప్పుడు సీట్ చోరీ కూడా మెదలుపెట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదన్న రేవంత్‌రెడ్డి, ఇందులో రిటర్నింగ్ అధికారి కమలం పార్టీ కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు.

2

### పశ్చిమాసియాలో

# శాంతికి ఛాన్స్..


- త్వరలో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం ఖరారు!
- పశ్చిమాసియాలో శాంతి కోసం చర్చలు
- వచ్చే వారం ప్రారంభంలో యూఎస్, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం ఖరారయ్యే అవకాశం- కీలక దశలో చర్చలు


పశ్చిమాసియాలో నెలకొన్న సుదీర్ఘ సంక్షోభానికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒక అవగాహన ఒప్పందం వచ్చే వారం ప్రారంభంలో ఖరారు కానుంది. ఇది దీర్ఘకాలిక ద్వైపాక్షిక ఒప్పందం దిశగా ఉన్నత స్థాయి దౌత్య చర్చలకు మార్గం సుగమం చేస్తుంది. ఈ ఒప్పందంతో సంబంధం ఉన్న ఇరు వర్గాలను ఉటంకిస్తూ ఓ అమెరికా వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది.

**వార్తాసంస్థ కథనం ప్రకారం**

ఈ అవగాహన ఒప్పందంపై అమెరికా-ఇరాన్ సంతకం చేసి డీల్‌లోని వివరాలపై 60 రోజుల పాటు చర్చలు జరుపుతాయి. అవసరమైతే ఈ ప్రాథమిక

మిగతా 2లో





# బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు



2లో

- సంక్షోభం వేళ కేంద్రం కీలక నిర్ణయం
- పశ్చిమాసియాలో అంతకంతకు ముదురుతున్న యుద్ధం
- హర్మూజ్ జలసంధి మూసివేతతో ముడి చమురు రవాణాకు ఇబ్బందులు
- ఈ క్రమంలో పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై నిషేధం విధించిన భారత్



2లో

## 'రష్యా చమురు కొనమన్నది అమెరికాయే'.. పాశ్చాత్య దేశాల ద్వంద్వ వైఖరిపై జైశంకర్ ఫైర్

- ధర, లభ్యత ఆధారంగానే కొనుగోళ్ల స్పష్టీకరణ
- టారిఫ్‌లు విధించి మళ్లీ ఎత్తివేసిందంటూ అమెరికాపై ఫైర్
- యూరప్ ఆయుధాలపై కూడా జైశంకర్ విమర్శలు
- నైతికత పేరుతో విమర్శలు సరికాదన్న మంత్రి

# 'ఈసీని ఆశ్రయించండి'

## - నటరాజన్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

- కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరిస్తే ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయించడం ఒక్కటే మార్గమని స్పష్టం





కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరిస్తే, ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేసింది. రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ, సర్వోన్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే ఈ కేసు యోగ్యత (మెరిట్స్) గురించి తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్ చందుర్కర్లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

మిగతా 2లో



2లో

## మోదీ సర్కార్‌పై ప్రజల్లో ఆగ్రహం- వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం

- వచ్చే ఎన్నికల్లో పోలింగ్ నిష్పక్షపాతంగా జరగకపోవచ్చు - విమర్శలనే విమర్శలు మింగే నీలకంఠుడిని నేను
- ఇండియా కూటమి మీటింగ్‌లో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



2లో

## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఖమ్మం బాలికకు హరీశ్ రావు పరామర్శ..


## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్

- ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి, భవనంపై నుంచి తోసివేత ఘటన
- తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు
- నిందితుడు గౌస్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసిన పోలీసులు
- బాధితురాలిని పరామర్శించిన హరీశ్ రావు


### ముంబైలో ఖర్చులు భరించలేను.. హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతివ్వండి:

## బాంబే హైకోర్టును ఆశ్రయించిన వరవరరావు

- తన నివాసాన్ని హైదరాబాద్‌కు మార్చాలని కోరుతూ వరవరరావు పిటిషన్
- పిటిషన్‌పై స్పందించాలని ఎన్ఐఏకు నోటీసులు జారీ చేసిన బాంబే హైకోర్టు
- ముంబైలో జీవనం ఆర్థికంగా భారంగా మారిందని పిటిషన్‌లో పేర్కొన్న కవి
- భీమా కోరేగావ్ కేసులో బెయిల్ షరతుల కారణంగా ముంబైలో నివాసం
- రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఎన్ఐఏకు ధర్మాసనం ఆదేశం



2లో




2లో

## పాలకులం సేవకులం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం: రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు

- ఏపీలో రెండేళ్లు పూర్తి చేసుకున్న ఎన్డీఏ ప్రభుత్వం
- గత ప్రభుత్వం మిగిల్చిన సవాళ్లను అధిగమించామన్న సీఎం
- అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించడమే లక్ష్యమని వెల్లడి
- ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై సిట్ విచారణ జరిపించండి: కేటీఆర్ ఎద్దేవా

- ప్రతి అంశానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందన్న కేటీఆర్
- మీనాక్షికి వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నేతలు వ్యవహరించి ఉండొచ్చని వ్యాఖ్య
- పార్టీ ద్రోహులను రాహుల్ గాంధీ గుర్తించాలని సూచన



2లో

# పశ్చిమాసియాలో శాంతికి ఛాన్స్

చర్చల గడువును పొడిగించవచ్చు. ఈ ఒప్పంద పత్రంలో వ్యూహాత్మకమైన హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం వంటి అంశాలు ఉండనున్నాయి. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉందని గానీ లేదా దాని కోసం ప్రయత్నించిందని గానీ అమెరికా నిఘా వర్గాలు అంచనా వేయలేదని పేర్కొంది. అందుకు బదులుగా ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయడానికి ప్రయత్నించిందని అమెరికా ఆరోపిస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తమ అణు కార్యక్రమం శాంతియుతమైనదని చెబుతున్నప్పటికీ, దానిని ధ్రువీకరించడానికి అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)ను ఇరాన్‌లోకి అనుమతించడానికి నిరాకరించింది. అయితే ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అందుకు భిన్నమైన అంచనా వేశాయి. ఇరాన్‌లో యురేనియం నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి.

**ఇరాన్‌తో గొప్ప డీల్ కుదుర్చుకున్నాం : ట్రంప్**
కాగా, ఇరాన్‌తో గొప్ప ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. ఆ డీల్ తుది దశలో ఉందని చెప్పారు. అణ్వాయుధాలు వదులుకునేందుకు ఇరాన్ అంగీకరించిందని స్పష్టం చేశారు. ఈ ఒప్పందంతో ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండదని పేర్కొన్నారు. డీల్‌పై సంతకాల తర్వాత హార్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందని వెల్లడించారు. దీంతో ప్రపంచ ఇంధన మార్కెట్లపై నెలకొన్న ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదిత ఒప్పందానికి ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆమోదించారని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. యూరప్‌లో ఈ వారాంతంలో డీల్‌పై సంతకాలు జరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తాను హాజరుకాబోనని, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హాజరుకావొచ్చని అన్నారు.

**ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని ఏమన్నారంటే?**
మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య ఒప్పందం కుదురుతుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య కుదిరే ఏ తుది ఒప్పందంలోనైనా ఇరాన్ తన వద్ద పోగుచేసుకున్న సుసంపన్న యురేనియం నిల్వలను తొలగించడం, క్షిపణి ఉత్పత్తులపై పరిమితులు విధించడం వంటి అంశాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ డీల్‌లో ఇజ్రాయెల్ భాగం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

**ట్రంప్ ప్రకటనను కొట్టిపారేసిన ఇరాన్..** అయితే ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఇరాన్ స్పందించింది. ఈ డీల్ గురించి తాము ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. ఇరుదేశాల మధ్య డీల్ కుదిరిపోతుందని ట్రంప్ వెల్లడించగా, ఇరాన్ మాత్రం ఆ ప్రకటనను తోసిపుచ్చడం గమనార్హం. దీంతో ట్రంప్ ప్రకటనపై మరోసారి ఉత్కంఠ నెలకొంది.

**'ఆ వార్తలతో జాగ్రత్తగా ఉండాలి'..** శాంతి ఒప్పందంపై వాషింగ్టన్ నుంచి వస్తున్న ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా సూచించింది. గత రెండు నెలలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ఒక దౌత్య పురోగతిని అంచనా వేస్తున్నారని పేర్కొంది.
ఇప్పటి వరకు ట్రంప్ 38 వేర్వేరు సందర్భాల్లో ఈ ఒప్పందం కుదరబోతోందని ప్రకటించారని గుర్తు చేసింది. ఈ డీల్ గురించి ఇరాన్ ప్రకటించే వరకు ట్రంప్ నుంచి వచ్చే ఏ వార్త అయినా ఆయన గతంలో చేసిన ప్రకటనల మాదిరిగానే పరిగణించాలని అభిప్రాయపడింది. ట్రంప్ పదే పదే తమ దేశం ఇరాన్ మధ్య డీల్ కుదరబోతోందని ప్రకటనలు చేస్తుండడంతో ఇరాన్ ప్రభుత్వ మీడియా ఈ మేరకు వివరణ ఇచ్చింది.

# తెలంగాణకు వచ్చివెళ్లేందుకు... పోటీ చేసేందుకు పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది

**కిమ్ లాగనే బీజేపీ నేతలు తీరు :** బీజేపీ ఇప్పటిదాకా గాడ్సేను ఆదర్శంగా తీసుకుందని అనుకున్నామని, అయితే ఇప్పుడు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను ఆదర్శంగా తీసుకుందంటూ సీఎం వ్యాఖ్యానించారు. కిమ్ లాగనే బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఉత్తరకొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, కానీ ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. సంఖ్యా బలం లేకపోయినా మధ్యప్రదేశ్‌లో మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి నంబర్ లేకపోయినా, పోటీలో ఎందుకు నిల్చున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అటు ప్రజాస్వామ్య వ్యతిరేకిగా, ఇటు మహిళా వ్యతిరేకిగా బీజేపీ నిలబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదం నుంచి బయటపడేందుకే ఆ పార్టీ తమపై నేరపూరిత దాడికి దిగిందన్నారు.

**తెలంగాణలో పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది :** తెలంగాణకు వచ్చివెళ్లేందుకు, పోటీ చేసేందుకు జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్‌పై మంత్రులు మాట్లాడారని చెప్పుకొచ్చారు. శాంతి భద్రతల కారణంతోనే పవన్ ఇటీవల తలపెట్టిన మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేదని వివరించారు. ఏపీలో జగన్ సభలకు ఎందుకు అనుమతి ఇవ్వట్లేదో పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

**ఎప్పుడూ చెప్పలేదు :** హిట్లర్ తనకు ఆదర్శమని ఎప్పుడూ చెప్పలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్లు ఎవరైనా హిట్లర్ ఆదర్శమని అంటారా అని ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద ఎటువంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు.

**కిషన్‌రెడ్డి కారణం! :** తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ చెప్పినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డితో మాట్లాడి అడ్డుకున్నట్లు కేటీఆర్ ప్రకటించారని సీఎం అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డును కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం ఆరోపించారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డి కారణమని విమర్శించారు. కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. ఎవరి వద్ద తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే తనకు చెప్పారని రేవంత్ అన్నారు. పోలవరం కోసం 4 మండలాలను ఏపీలో కలిపారని, అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా అని నిలదీశారు. మహారాష్ట్రను ఒప్పించే వరకు కేబినెట్‌కు రానని కిషన్‌రెడ్డి చెప్పలేరా, తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో కిషన్‌రెడ్డి ఒక్కసారైనా మాట్లాడారా అని నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీకి ఉన్న 8 మంది ఎంపీలంతా గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం వల్ల ఇంధన సరఫరా కష్టమవుతుండడంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బదులుగా వారి అవసరాల కోసం ఇంధనాన్ని బల్క్ అమ్మకపు కేంద్రాల నుంచి పొందాలని సూచించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లోకి ఉంటుందని పేర్కొంది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ ఇంధనం నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యానికి ఆదేశాలిచ్చింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది.

**డీజిల్‌కు పెరిగిన డిమాండ్..** ధరల వ్యత్యాసం కారణంగా బల్క్ వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించడంతో కొన్ని ప్రాంతాలలో డీజిల్‌కు అసాధారణ డిమాండ్ పెరిగింది. దీంతో దేశ రాజధాని దిల్లీలోని పెట్రోల్ పంపుల వద్ద లీటరు డీజిల్ ధర రూ. 95.20 కాగా, బల్క్ సరఫరాదారుల వద్ద లీటర్ డీజిల్ ధర రూ. 134.50గా ఉంది. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై కేంద్రం ఈ ఆంక్షలు విధించింది.

**ప్రభుత్వ రంగ బంకుల్లో పెరిగిన సేల్స్..** పశ్చిమాసియా సంక్షోభం తరువాత పెరిగిన ఇంధన ధరల నుంచి సాధారణ వినియోగదారులను కాపాడటానికి ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు రిటైల్ ధరలను సర్దుబాటు చేయడంతో ఈ వ్యత్యాసం ఏర్పడింది. టెలికాం టవర్లు, విద్యుత్ ఉత్పత్తి, ఇతర ఫీడ్‌స్టాక్ అవసరాల కోసం డీజిల్‌ను ఉపయోగించే పరిశ్రమలు వంటి బల్క్ వినియోగదారులకు మార్కెట్ ధర వసూలు చేస్తుండగా, రిటైల్ అవుట్‌లెట్ల వద్ద ధరలు ఉత్పత్తి వ్యయం కంటే చాలా తక్కువగా ఉన్నాయి. ధరలలోని ఈ వ్యత్యాసం వల్ల పెట్రోల్, డీజిల్‌ను అధిక రేట్లుకు విక్రయించే ప్రైవేట్ రంగ అవుట్‌లెట్లలో అమ్మకాలు తగ్గిపోయాయి. ప్రభుత్వ రంగ సంస్థల పెట్రోల్ పంపుల్లో అమ్మకాలు పెరిగాయి.

**90రోజులపాటు ఆంక్షలు..** కాగా మే నెలలో మూడు ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లో పెట్రోల్ అమ్మకాలు 4.8 శాతం, డీజిల్ అమ్మకాలు 6.4 శాతం మేర పెరిగాయి. ఈ క్రమంలో రిటైల్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలు, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని వెల్లడించింది. అంతేగాకుండా పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశాలిచ్చింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని చెప్పింది. అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని ప్రకటించింది.

**తగు చర్యలకు అన్ని రాష్ట్రాలు, యూటీలకు ఆదేశాలు..** ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితి కారణంగా ఈ చర్య అవసరమైందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పరిస్థితి అంతర్జాతీయ పెట్రోలియం సరఫరా గొలుసులు, షిప్పింగ్ లాజిస్టిక్స్, పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతపై ప్రతికూల ప్రభావం చూపిందని స్పష్టం చేసింది. ఇంధన నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక సేకరణ, మళ్లింపు వంటి విషయానికి సంబంధించిన ఈ ఉత్తర్వును అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. పెట్రోల్, డీజిల్ సమాన లభ్యతను నిర్ధారించడం, నిల్వలు, మళ్లింపులను నివారించడం, దేశవ్యాప్తంగా నిరంతరాయ ఇంధన సరఫరాలను కొనసాగించడం ఈ చర్యల లక్ష్యమని పేర్కొంది.

# 'ఈసీని ఆశ్రయించండి'

"ఆర్టికల్ 32/226 ప్రకారం జోక్యం చేసుకోవాల్సిన కేసులు, నామినేషన్ తిరస్కరణకు సంబంధించిన ఇతర కేసులను గుర్తించడానికి న్యాయస్థానం అంగీకరిస్తే, ఆర్టికల్ 329 పరిధిలో లేని ఒక సూత్రాన్ని ఈ కోర్టు అన్వయించినట్లు అవుతుంది. అంతేకాదు కొన్ని విషయాల్లో కోర్టు జోక్యం చేసుకోవచ్చని, మరికొన్నింటిని ఎన్నికల ట్రిబ్యునల్ విచారణకు వదిలివేయాలనే వ్యాఖ్యానాలను ప్రోత్సహించేందుకు మేము భయపడుతున్నాం" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ఎన్నికల వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోకుండా నిరోధిస్తుంది. కోర్టు కేసుల వల్ల ఎన్నికలు ఆలస్యం కాకుండా చూస్తుంది. అందువల్ల రిటర్నింగ్ అధికారి ఒక అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించిన తర్వాత, ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడమే ఏకైక మార్గం" అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మీనాక్షి నటరాజన్ తరఫు న్యాయవాదిని ఉద్దేశిస్తూ, "ఇలాంటి కేసుల్లో తాము జోక్యం చేసుకున్నట్లు ఏదైనా తీర్పును చూపించండి" అని సుప్రీంకోర్టు అడిగింది. "ఆ నిర్ణయం ఎంత తప్పు అయినప్పటికీ, ఒకసారి నామినేషన్ తిరస్కరణకు గురైతే, దాని పరిష్కారం వేరే చోట ఉంటుంది. మేము ఇలాంటి దశలో జోక్యం చేసుకున్నట్లు ఏదైనా ఆధారం ఉందా?".దీనితో నటరాజన్ తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి తన వాదనలు వినిపిస్తూ, " కనీసం రెండేళ్ల శిక్ష పడే అవకాశం ఉన్న క్రిమినల్ కేసును మాత్రమే అభ్యర్థి వెల్లడించాల్సి ఉంటుంది. ప్రస్తుత వ్యవహారంలో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయి. అయితే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం క్రిమినల్ కేసులను వెల్లడించలేదనే కారణం చూపిస్తూ, మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి తప్పుడు విధానంలో తిరస్కరించారు" అని అన్నారు.రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరవింద్ శర్మ ఒక ఉత్తర్వు జారీ చేస్తూ, కీలక విషయాలు వెల్లడించారు. 'అందుబాటులో ఉన్న పత్రాలను పరిశీలించిన తర్వాత, నటరాజన్ తన నామినేషన్‌తో పాటు సమర్పించిన ఫారమ్ 26లో ఒక కోర్టు ఫిర్యాదును పేర్కొనలేదు. అంతేకాదు ఆమె అసంపూర్ణమైన అఫిడవిట్‌ను సమర్పించినట్లు తేలింది' అని పేర్కొన్నారు.

**ఇది నాకు కాదు, ప్రజాస్వామ్యానికి ఎదురుదెబ్బ..** కాగా, తన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడంపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ తీవ్రంగా స్పందించారు. ఇది తనకు కాదు, భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తగిలిన గట్టి ఎదురుదెబ్బ అని అన్నారు."ఇది వ్యక్తిగతంగా నాకు తగిలిన ఎదురుదెబ్బకాదు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగాన్ని తగిలిన గట్టి ఎదురుదెబ్బ. ఎలక్షన్ కమిషన్ సభ్యులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని నేను మొదటే చెప్పాను. మా వాళ్లు ఎన్నికల సంఘం వద్దకు వెళ్లారు. కానీ 48 గంటల పాటు మాకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. సుప్రీంకోర్టు కనీసం మా విన్నపాన్ని ఆలకించింది."
ప్రస్తుతం మన దేశంలో ఎలక్షన్ కమిషన్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని నటరాజన్ విమర్శించారు. ఈ సమస్య కేవలం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనే కాదు, మొత్తం దేశవ్యాప్తంగా ఉందని పేర్కొన్నారు. తన నామినేషన్ తిరస్కరించిన రిటర్నింగ్ అధికారి తీరుతో ఇది బట్టబయలైందని అన్నారు. అయితే తాను ప్రస్తుతం సుప్రీం కోర్టు గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని నటరాజన్ స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ అధికారి తెలిపిన వివరాల ప్రకారం, 'బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవట్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఒక కేసు నమోదు అయ్యిందని, కానీ ఆమె ఆ విషయాన్ని అఫిడవిట్‌లో పేర్కొనలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె రాజ్యసభ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు.'

# ముంబైలో ఖర్చులు భరించలేను.. హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతివ్వండి: బాంబే హైకోర్టును ఆశ్రయించిన వరవరరావు

భీమా కోరేగావ్-ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడైన ప్రముఖ విప్లవ కవి, 85 ఏళ్ల పి. వరవరరావు దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. తన నివాసాన్ని ముంబై నుంచి హైదరాబాద్‌కు మార్చుకునేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశిస్తూ న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.జస్టిస్ అజయ్ గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ముంబైలో నివాసం ఉండటం ఆర్థికంగా పెనుభారంగా మారిందని, వృద్ధాప్యంలో ఇక్కడి జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నానని వరవరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన నెలవారీ పింఛను సుమారు రూ. 50,000 ఉండగా, ముంబైలో జీవన వ్యయం రూ. 77,000 దాటుతోందని, ఇది తనకు భారంగా మారిందని ఆయన వివరించారు. భీమా కోరేగావ్ కేసులో బెయిల్ పొందిన వరవరరావు, కోర్టు అనుమతి లేకుండా గ్రేటర్ ముంబై పరిధిని దాటి వెళ్లరాదన్న షరతుపై ప్రస్తుతం అక్కడే నివసిస్తున్నారు. ఇదే అభ్యర్థనతో ఆయన గతంలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది మార్చి 16న ఆ పిటిషన్ తిరస్కరణకు గురైంది. సుప్రీంకోర్టు విధించిన బెయిల్ షరతులను సవరించే అధికారం తమకు లేదని ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టులో అరెస్టయిన వరవరరావుకు, ఆరోగ్యం క్షీణించడంతో 2021లో బాంబే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం 2022లో సుప్రీంకోర్టు వైద్య కారణాలతో ఆయన బెయిల్‌ను ఖరారు చేసింది. తాజాగా ఎన్ఐఏ తన ప్రత్యుత్తరాన్ని దాఖలు చేసిన తర్వాత ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జరగనుంది.

# 'రష్యా చమురు కొనమన్నది అమెరికాయే'.. పాశ్చాత్య దేశాల ద్వంద్వ వైఖరిపై జైశంకర్ ఫైర్

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శిస్తున్న పాశ్చాత్య దేశాలపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఘాటుగా స్పందించారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురు కొనుగోలు చేయాలని భారత్‌ను స్వయంగా అమెరికానే కోరిందని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్లో ధరలు అదుపులో ఉండాలంటే రష్యా చమురు కొనాలని అప్పట్లో అగ్రరాజ్యం సూచించిందని చెప్పారు. ఫిన్లాండ్ పర్యటనలో భాగంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై భారత్ మరీ సానుభూతి చూపుతోందని, ఎక్కువగా రష్యా చమురునే కొనుగోలు చేస్తోందని ఓ జర్నలిస్టు ప్రశ్నించగా ఆయన గట్టిగా బదులిచ్చారు. తాను చమురు కొనేటప్పుడు ధర, లభ్యత మాత్రమే చూస్తానని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత అమెరికా సహా పాశ్చాత్య దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాయి. దీంతో యూరప్ దేశాలు పశ్చిమాసియా దేశాల చమురును ఎక్కువగా కొనుగోలు చేయడం ప్రారంభించాయి. అదే సమయంలో భారత్‌కు అందుబాటులో ఉన్న పెద్ద సరఫరాదారు రష్యానే అయిందని జైశంకర్ వివరించారు. పరిస్థితులే భారత్‌ను ఆ దిశగా నడిపించాయని చెప్పారు.రష్యా చమురు విషయంలో అమెరికా వైఖరిని కూడా ఆయన ప్రశ్నించారు. ఓవైపు రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై టారిఫ్‌లు విధించారని తర్వాత వాటినే ఎత్తివేశారని గుర్తుచేశారు. ఇందులో గొప్ప సూత్రాలు ఏమీ లేవని, దీనికి నైతికత ముసుగు వేయడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. గత ఏడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం భారత వస్తువులపై 50 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. ఇందులో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తోందంటూ విధించిన 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. అయితే ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రపంచ ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి పెరగడంతో ఆ ఆంక్షలను అమెరికా సడలించింది.యూరప్ దేశాలపై కూడా జైశంకర్ విమర్శలు గుప్పించారు. భారత్‌పై దాడులకు ఉపయోగించే ఆయుధాలను యూరప్ దేశాలు ఎన్నో ఏళ్లుగా విక్రయిస్తున్నాయని చెప్పారు. భారత ఆయుధాలతో యూరప్‌లోని ఏ దేశంపైనా దాడులు జరగలేదని స్పష్టం చేశారు. కానీ యూరప్ నుంచి వెళ్లిన ఆయుధాలు భారత్‌పైకి మాత్రం దూసుకొస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు.

## మోదీ సర్కార్‌పై ప్రజల్లో ఆగ్రహం- వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం

మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని బట్టి చూస్తే, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కానీ అసలు సమస్య ఏమిటంటే, విపక్ష కూటమి గెలవడానికి ఇక్కడ స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగవు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

**ఐక్యంగా పోరాడదాం..** సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, విపక్ష నేతలు అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. "మనం కలిసికట్టుగా నిలబడి ప్రతిఘటిస్తే బీజేపీని ఓడించడం చాలా సులువు" అని పేర్కొన్నారు. ఇక వామపక్ష పార్టీలతో సహా ఇతర మిత్ర పక్షాలు కాంగ్రెస్‌పై చేస్తున్న విమర్శలపై గాంధీ స్పందిస్తూ, "నేను విషాన్ని మింగిన నీలకంఠుడిని, నాపైగానీ, నా పార్టీపై గానీ వాళ్లు చేసే ఎలాంటి విమర్శలనైనా ముఖంపై చిరునవ్వుతో స్వీకరిస్తాను" అని అన్నారు. తాజాగా (శుక్రవారం) ఈ ప్రసంగం వీడియోను ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఖమ్మం బాలికకు హరీశ్ రావు పరామర్శ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్

తెలంగాణలోని ఖమ్మం పట్టణంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన అమానుష దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాలికపై లైంగిక దాడికి యత్నించి, ఆమెను ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసిన ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో వెన్నెముక, పక్కటెముకలు, చేతులకు తీవ్ర గాయాలైన బాధితురాలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.. జూన్ 6న ఖమ్మంలోని రాపర్తి నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. అదే అపార్ట్‌మెంట్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ గౌస్, వాచ్‌మెన్ కుమార్తె అయిన సదరు బాలికను పైఅంతస్తులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటిస్తూ కేకలు వేయడంతో, నిందితుడు ఆమెను భవనం పైనుంచి కిందకు తోసేశాడు. మొదట ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించిన కుటుంబ సభ్యులు, బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత అసలు విషయం చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనపై ఖమ్మం పోలీసులు పోక్సో (ఘూజూూ) చట్టం కింద కేసు నమోదు చేసి, 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆమె ఆహారం తీసుకుంటోందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ వెల్లడించారు.

**ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు..** గురువారం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు పరామర్శించారు.
రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ 5 నుంచి 6 పోక్సో కేసులు నమోదవుతున్నాయని ఆయన ఆరోపించారు. బాధితురాలికి ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మెరుగైన వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నిమ్స్‌లో మందులు ఉచితంగా లభించడం లేదని, పేద కుటుంబానికి చెందిన బాధితులు వాటిని బయట కొనాల్సి వస్తోందని ఆయన విమర్శించారు.

## పాలకులం సేవకులం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం: రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు

ఏపీలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారంతో రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, గత వైసీపీ ప్రభుత్వం మిగిల్చి వెళ్లిన సవాళ్లు, సంక్షోభాలను అధిగమించి, ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చంద్రబాబు తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఐదు కోట్ల ప్రజల అపారమైన నమ్మకంతో ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయింది. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, అపరిష్కృత సమస్యల వారసత్వాన్ని మిగిల్చి వెళ్లగా, వాటన్నింటినీ అధిగమించి మేము ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. పాలనపై తమ ప్రభుత్వ విధానాన్ని వివరిస్తూ.. "అధికారం ఒక బాధ్యత అని, పాలకులు ప్రజలకు సేవకులని మా ప్రగాఢ నమ్మకం. ప్రతి పౌరుడు, ప్రతి కుటుంబం, సమాజంలోని ప్రతి వర్గం విజయం, శ్రేయస్సే మా ఎజెండా. వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తూ రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు. ఈ రెండేళ్ల ప్రయాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. "రాష్ట్ర అభివృద్ధికి ప్రతి అడుగులో అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రజల తరపున నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కేంద్ర ప్రభుత్వ సహకారంతో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో 'స్వర్ణాంధ్ర' దిశగా పయనిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. తమకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

**పునరుద్ధరించబడిన ఆశావాదం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**
కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా 'ఎక్స్'లో స్పందించారు. "రెండేళ్ల క్రితం, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక కొత్త ప్రారంభం కోసం ఎన్డీఏపై నమ్మకం ఉంచారు. మా ముందున్న సవాళ్లు చాలా పెద్దవి. రాష్ట్ర భవిష్యత్తుపై తిరిగి విశ్వాసం నింపడం అంత సులభమైన పని కాదు" అని ఆయన పేర్కొన్నారు. "గడిచిన రెండేళ్లలో ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో బలమైన కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి వృద్ధి, అవకాశాలు, అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం జరిగింది. ఇంకా చేయాల్సింది చాలా ఉన్నప్పటికీ, ఈ రోజు మన ప్రజల్లో పునరుద్ధరించబడిన ఆశావాదం, రాష్ట్రం సరైన దిశలో పయనిస్తోందన్న విశ్వాసం మాకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ప్రజలు మాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు" అని రామ్మోహన్ నాయుడు తన పోస్టులో పేర్కొన్నారు.

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై సిట్ విచారణ జరిపించండి: కేటీఆర్ ఎద్దేవా

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు.
మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు.
తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు.
అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# 5వ ఐఈఈఈ వామ్స్-2026 అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న భారత ప్రభుత్వ అంతరిక్ష మంత్రిత్వ శాఖకు చెందిన సాంకేతిక విభాగం డైరెక్టర్ శ్రీ రాజీవ్ జ్యోతి



**పరిశ్రమ మరియు అకాడెమియా మధ్య సహకారం**

**పరిశ్రమఉవిద్యారంగ భాగస్వామ్యం**

**ప్యానెల్ చర్చలో పాల్గొన్న ఇస్రో శాస్త్రవేత్తలు,**

**సీఎస్ఐఆర్ఉనేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్ శాస్త్రవేత్తలు,**

**18 దేశాలకు చెందిన ప్రతినిధులు**










సమస్త ప్రక్షాళనం/నర్సాపూర్ మెదక్ జిల్లా నర్సాపూర్ బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్ -2026) మూడవ రోజు కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయి. దేశ విదేశాల నుండి వచ్చిన పరిశోధకులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు మరియు విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది.

మూడవ రోజు కార్యక్రమాల్లో భాగంగా భారత ప్రభుత్వ అంతరిక్ష మంత్రిత్వ శాఖకు చెందిన సాంకేతిక విభాగం డైరెక్టర్ శ్రీ రాజీవ్ జ్యోతి పరిశ్రమఉవిద్యా సంస్థల సహకారంపై నిర్వహించిన ప్రత్యేక ప్యానెల్ చర్చలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష రంగం, అందులోని అవకాశాలు మరియు విలువైన సమాచారాన్ని తెలియపరిచారు.

ఈ సందర్భంగా బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబె మాట్లాడుతూ, భారత అంతరిక్ష కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్న ప్రముఖ నిపుణులలో ఒకరైన శ్రీ రాజీవ్ జ్యోతి నుంచి విద్యార్థులు మరియు అధ్యాపకులు ప్రత్యక్షంగా నేర్చుకునే అరుదైన అవకాశం లభించిందని పేర్కొన్నారు. ప్రధాన ఆకర్షణలలో "ఐఈఈఈ ఉమెన్ ఇన్ ఇంజనీరింగ్" ప్రత్యేక సదస్సు ఒకటి. మహిళలను ఇంజనీరింగ్, విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాల్లో ప్రోత్సహించేందుకు ఐఈఈఈ చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సిఎస్ఐఆర్ఉనేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్ బెంగళూరుకు చెందిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. బాలమతి చౌదరి, ఇస్రో యు.ఆర్. రావు శాటిలైట్ సెంటర్ బెంగళూరుకు చెందిన సీనియర్ సైంటిస్ట్ డా. హిమాని సైనీ, సౌదీ అరేబియాలోని కింగ్ అబ్దుల్లా యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో పోస్ట్‌డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోగా పనిచేస్తున్న డా. అపాలా బెనర్జీ పాల్గొని వారుసాధించిన విజయాలను పంచుకున్నారు. "ఇండియా సెమీకండక్టర్ మిషన్: పవరింగ్ ది ఫ్యూచర్" అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్, ఐఈఈఈ యంగ్ ప్రొఫెషనల్స్ సెషన్, స్టార్టప్ సెషన్, ఇండస్ట్రీ సెషన్, మెంటరింగ్ కార్యక్రమాలు మరియు ప్రొఫెషనల్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించబడ్డాయి.వామ్స్ -2026 జనరల్ చైర్ డా. బి.ఆర్. సంజీవ రెడ్డి మాట్లాడుతూ, వైర్లెస్ కమ్యూనికేషన్స్, యాంటెన్నాలు, మైక్రోవేవ్స్ మరియు అంతరిక్ష సాంకేతికతల రంగాల్లో ఆవిష్కరణలు, అకాడెమియా, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు మరియు యువ ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రపంచ స్థాయి వేదికగా వామ్స్ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి శ్రీ రాజీవ్ జ్యోతి, డా. సుధాకర్ కె. రావు, డా. సి.జె. రెడ్డి (వర్చువల్), ప్రొఫెసర్ ఫ్రాన్సెస్కో పి. ఆండ్రియుల్లీ, ప్రొఫెసర్ క్రిస్టోఫ్ ఫ్యూమోక్స్, డా. ధవల్ పుజారా, శ్రీ ఫిల్ వెనిజియా తదితర ప్రముఖులు హాజరయ్యారు. దేశంలోని వివిధ జాతీయ ప్రయోగశాలల శాస్త్రవేత్తలు, పరిశ్రమ ప్రతినిధులు, అధ్యాపకులు మరియు పరిశోధకులు కూడా పాల్గొన్నారు.వామ్స్ నిర్వహణకు శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ శ్రీ కె.వి.వి. విష్ణు రాజు వైస్ చైర్మన్ శ్రీ రవిచంద్రన్ రాజగోపాల్ సెక్రటరీ శ్రీ ఆదిత్య విస్సం అందించిన నిరంతర సహకారం, ప్రోత్సాహం మరియు మార్గదర్శకత్వంతో వామ్స్ అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా కొనసాగుతోందని విదేశీ ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, అన్ని విభాగాల అధిపతులు, 18 విదేశీ దేశ ప్రతినిధులు, ఐఐటీ, ఎన్ ఐటీ, ప్రముఖ యూనివర్సిటీ ప్రతినిధులు విద్యార్థులు మరియు అధ్యాపకులు ఇందులో పాల్గొన్నారు. కళాశాల అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ శ్రీ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ సురేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించ బడినది.

# టీసీఎస్ ఉద్యోగి ఆత్మహత్య... ఇద్దరు మహిళా సహోద్యోగులపై కేసు

ప్రముఖ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో పనిచేస్తున్న ఒక ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడటం పుణేలో సంచలనం సృష్టించింది. సహోద్యోగుల వేధింపుల వల్లే తాను ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు మృతుడు రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు ఇద్దరు మహిళా ఉద్యోగులతో సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు.టీసీఎస్ హింజేవాడి కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న అమిత్ అభయ్ బ్రహ్మే (48) జూన్ 2న భోసరిలోని తన నివాసంలో ఉరివేసుకుని ప్రాణాలు విడిచారు. ఆయన కుమారుడు అనీష్ బ్రహ్మే (19) జూన్ 9న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలం నుంచి పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను వివరిస్తూ అమిత్ రాసిన లేఖను స్వాధీనం చేసుకున్నారు.ఆ లేఖలో తన సహోద్యోగినులు అర్చన, శశ్వతి తనను అందరి ముందు పదేపదే అవమానించారని అమిత్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నైపుణ్యం లేని ప్రాజెక్టులను అప్పగించడం, పనితీరు సరిగా లేదని బహిరంగంగా మందలించడంతో పాటు ఉద్యోగానికి రాజీనామా చేయాలని తీవ్రంగా ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు తన స్నేహితుడు వినోద్ పలిచా కంపెనీ యాజమాన్యానికి తనపై అసత్య ఆరోపణలు చేస్తూ ఈమెయిల్స్ పంపాడని లేఖలో వివరించారు.కుమారుడి ఫిర్యాదు మేర, పింప్రి-చించ్‌వాడ్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 108 కింద అర్చన, శశ్వతి, వినోద్ పలిచాలపై ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై స్పందించిన టీసీఎస్ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ సంస్థలో ఉద్యోగుల శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేలుస్తామని హామీ ఇచ్చింది. కాగా, ఐటీ ఉద్యోగుల సంఘం 'ఎన్ఐటీఈఎస్' ఈ ఉదంతంపై స్వతంత్ర్య దర్యాప్తు జరపాలని కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసింది.

# సమాచార హక్కు చట్టం-2005 పూర్తి స్థాయిలో అమలు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం



సమస్త ప్రక్షాళనం- సంగారెడ్డి సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:12/06/2026 నాడు సమచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ మరియు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపకులు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులంతా కలిసి ప్రతీ మండలంలో మరియు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, మున్సిపాలిటీ కార్యాలయాల్లో,ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ౌ×ూ, ూౌ×ూ (పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ మరియు అప్పిలేట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్) ల యొక్క సమాచారం వారి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని , అన్ని సంస్థలల్లో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని, =× పెట్టుకున్న ప్రతీ పౌరుడికి కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో సరైన సమాచారం అందించాలని , ప్రజలకు =× చట్టం పై అవగాహన కల్పించడానికి తగిన కార్యక్రమాలు చేపట్టాలని, సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయి లో అమలు అయ్యేలా సహకరించాలని కోరాము.

ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర ఎక్సుగిటీవ్ మెంబర్ భారత కవి కనకాంబరం గారు మరియు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సర్దార్ గారు మరియు సంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మురళీధర్ గారు,సంగారెడ్డి జిల్లా సెక్రటరీ బండి పురుషోత్తం గారు, సంగారెడ్డి జిల్లా సెక్రటరీ మొహమ్మద్ షాదుల్ గారు,సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జ ూ రాములు గారు,తదితరలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ వ్యాసరచన, చిత్రలేఖనం విజేతలైన ఖేడ్ జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులకు అవార్డులు అందజేసిన డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ కే ఏ వి ఎస్ ప్రసాద్ రెడ్డి







సమస్త ప్రక్షాళనం : నారాయణ ఖేడ్ సంగారెడ్డి జిల్లా లో జరిగిన సమస్త ప్రాణికోటి పరిరక్షణనే ధ్యేయంగా పర్యావరణం కోసం జన చైతన్యమే లక్ష్యంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖనంలో విజేతలైన నారాయణ ఖేడ్ జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులు వైష్ణవి,సహస్ర, నందిని, శ్రీరామ్, సాయి తేజ, జగదీష్ ల కు అవార్డులను సంగారెడ్డి జిల్లా కేంద్రం అటవీ శాఖ కార్యాలయంలో డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ కే ఏ వి ఎస్ ప్రసాద్ రెడ్డి అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణ పట్ల నారాయణ ఖేడ్ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విద్యార్థులలో సృజనాత్మక మరియు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండి చెట్ల పెంపకం కోసం కృషి చేయాలి అన్నారు . ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి అనురాధ, హెచ్ఎం మన్మద్ కిషోర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆచార్య , ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లు కృష్ణ గౌడ్, సంజీవ్, ,వనజ తదితరులు పాల్గొన్నారు.

# ముందుంది కష్ట కాలం.. రాష్ట్రాలను హెచ్చరించిన ప్రధాని నరేంద్ర మోదీ..

సమస్త ప్రక్షాళనం :తెలంగాణ

భారత్‌లో భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ సవాళ్లపై ప్రధాని మోదీ రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేశారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో మాట్లాడిన ఆయన, ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.దేశ అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలో వాతావరణ మార్పులు ప్రధాన చర్చాంశంగా నిలిచాయి. ఈ సమావేశంలో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే సమర్థవంతమైన ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ప్రపంచ వాతావరణ సంస్థ సహా పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు 2026 మధ్యకాలంలో ఎల్ నినో ప్రభావం కనిపించే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే అంచనా వేశాయి. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆసియా దేశాల్లో వర్షపాతం నమూనాలు మారిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి. దీని ప్రభావం ప్రపంచంలోని అనేక దేశాలపై కనిపిస్తుంది. భారతదేశంలో అయితే ఇది రుతుపవనాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. సాధారణంగా ఎల్ నినో ప్రభావం



పెరిగిన సంవత్సరాల్లో వర్షపాతం తగ్గడం, వడగాలులు అధికమవడం, కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడటం వంటి సమస్యలు కనిపిస్తాయి. వ్యవసాయ రంగంపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుంది.భవిష్యత్తులో నీటి కొరత సమస్యలను ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ప్రధాని రాష్ట్రాలకు సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను విస్తరించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం, సాగునీటిని సమర్థంగా వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నిర్వహణకు సంబంధించి కొత్త విధానాలు రూపొందించాలని కూడా సూచించారు.

# మళ్లీ మొదలైన ఎల్ నినో- ఈ వర్షాకాలంలో మరింత బలపడే ఛాన్స్ : ఐఎండీ



పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతంలో ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. రానున్న వర్షాకాలం(నైరుతి రుతుపవనాల కాలం)లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది.

ఐఎండీ తన జూన్ 2026 ఎన్సో (ఈఎన్ఎస్ఓ), ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) బులెటిన్‌లో ఈ వివరాలు వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్ర మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగాయని, ఇవి ఎల్ నినో ఏర్పడడానికి కావాల్సిన స్థాయిని దాటిపోయాయని పేర్కొంది. దీనికనుగుణంగానే వాతావరణంలో కూడా మార్పులు వచ్చాయని తెలిపింది. సముద్రం, గాలి కలిసి పనిచేసే తీరును బట్టి చూస్తే, ప్రస్తుతం భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్ నినో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. 'మాన్సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్' (వీఏజఖీూ) అంచనాల ప్రకారం, ఈ వర్షాకంలో ఎల్ నినో పరిస్థితులు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

వాస్తవానికి 2026 జూన్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఈ పరిమితిని దాటేశాయని ఐఎంపీ తన బులెటిన్‌లో పేర్కొంది. ఈ వాతావరణ మార్పును కొలిచే 'నినో 3.4 ఇండెక్స్' మూడు నెలల సగటు ఉష్ణోగ్రత +0.5సీ కంటే పైకి రికార్డ్ అయ్యిందని తెలిపింది. ఇది ఎల్ నినో ప్రారంభమైంది అనడానికి సంకేతమని స్పష్టం చేసింది. అంతేకాదు సముద్ర పైభాగంలోనే కాకుండా, లోపలి పొరల్లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, రానున్న నెలల్లో ఈ వేడి నీరు పైకి వచ్చి ఎల్ నినోను మరింత బలోపేతం చేస్తుందని ఐఎండీ గుర్తించింది.

భారత్‌పై ఈ ఎల్ నినో ప్రభావం ఎంత?

ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో వేడి పెరడం వల్ల వచ్చే ఒక సహజమైన వాతావరణ మార్పు. భారతదేశానికి సంబంధించి చూసుకుంటే, 2000వ సంవత్సరం తర్వాత అంటే 2002, 2009, 2015, 2023లో ఎల్ నినో తరహా వాతావరణ మార్పులు వచ్చాయి. సాధారణంగా ఈ ఎల్ నినో సమయంలో దేశంలో రుతుపవనాలు బలహీనపడడం, తక్కువ వర్షాలు కురవడం, ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వర్షాలు లేకుండా పొడి వాతావరణం ఏర్పడడం లాంటివి జరుగుతుంటాయి. మరీ ముఖ్యంగా కొన్ని సంవత్సరాలపాటు కరవు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది.అయితే భారతదేశ వర్షపాతాన్ని కేవలం ఎల్ నినో ఒక్కటే ప్రభావితం చేయదని ఐఎండీ స్పష్టం చేసింది. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో 'ఇండియన్ ఓషన్ డైపోల్' (ఐఓడీ) సాధారణ స్థితిలోనే ఉందని తెలిపింది. అందువల్ల ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించడంలో, పెంచడంలో దీని పాత్ర చాలా పరిమితం అని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో మారుతున్న పరిస్థితులను తాము నిరంతరం గమనిస్తూ, ప్రతి నెలా తాజా సమాచారాన్ని అందిస్తామని ఐఎండీ పేర్కొంది.

ఎల్ నినో ఏర్పడినప్పుడు ఏం జరుగుతుంది?

సాధారణంగా తీవ్రమైన ఎల్ నినో ఏర్పడినప్పుడు, ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన పరిస్థితులు తలెత్తుతాయి. దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియాలోని చాలా ప్రాంతాల్లో తీవ్రమైన కరువు, కార్చిచ్చులు వస్తాయి. అదే సమయంలో అమెరికాలోని దక్షిణ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి వరదలు ముంచెత్తుతాయి. ముఖ్యంగా భారత్ విషయానికొస్తే, ఎల్ నినో కారణంగా రుతుపవనాలు తీవ్రంగా బలహీనపడతాయి

. దీనివల్ల వర్షపాతం తగ్గిపోతుంది. ఈ పరిణామాల వల్ల ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగం కుదేలై పంట దిగుబడులు తగ్గిపోతాయి. ఆహార ధరలు ఆకాశాన్ని తాకుతాయి. సప్లై చైన్ దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థలకు లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మనిషి సృష్టిస్తున్న వాతావరణ మార్పులకు, ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడే ఈ ఎల్ నినో కలిస్తే ఎలాంటి విపత్తులు వస్తాయోనని శాస్త్రవేత్తలు భయపడుతున్నారు. ఈ ఎల్ నినో దెబ్బకి వచ్చే 2027 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది.భారత వర్షాకాలాన్ని ప్రభావితం చేసే కీలక వాతావరణ పరిణామమైన ఎల్‌నినో మళ్లీ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతుపవనాల కాలంలో ఈ ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో దేశవ్యాప్తంగా వర్షపాతం, వ్యవసాయం, నీటి లభ్యతపై ప్రతికూల ప్రభావం పడనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐఎండీ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం భూమధ్యరేఖా పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని మించి పెరగడంతో ఎల్‌నినో పరిస్థితులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. వాతావరణ వ్యవస్థల్లో కూడా ఈ మార్పుల ప్రభావం కనిపించడం ప్రారంభమైందని తెలిపింది. రాబోయే నెలల్లో ఈ పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని అంచనా వేసింది.

పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాలు అసాధారణంగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియే ఎల్‌నినో. భారతదేశంలో ఇది అత్యంత కీలకమైన అంశంగా పరిగణిస్తారు. ఎందుకంటే గతంలో ఎల్‌నినో ప్రభావం ఉన్న సంవత్సరాల్లో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం వంటి పరిస్థితులు ఎదురయ్యాయి.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావానికి గురయ్యే అత్యంత సున్నితంగా ఉన్న 197 జిల్లాలను గుర్తించామన్నారు. వాటి కోసం రాష్ట్రాలవారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి వారం పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అవసరమైన విత్తనాలు, వ్యవసాయ సామగ్రిని ముందుగానే నిల్వ చేశామని వెల్లడించారు.రైతుల్లో అవగాహన పెంచేందుకు 'ఖేత్ బచావో అభియాన్' పేరుతో దేశవ్యాప్త కార్యక్రమాన్ని కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణ సగటు వర్షపాతం కంటే సుమారు 90 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావం పెరిగితే రుతుపవనాల సీజన్ రెండో భాగంలో వ్యవసాయ రంగానికి మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలి

## న్యాయ విజ్ఞాన సదస్సులో లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్ పిలుపు




మెదక్ జిల్లా నర్సాపూర్, జూన్ 12:( సమస్త పక్షాళనం న్యూస్):జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ,మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ మండలంలోని తుల్జారంపేట గ్రామ డ్వాక్రా సంఘంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీగల్ సర్వీస్ న్యాయవాది జె.రాజు నాయక్..... మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపంగా మారిందని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. చదువుకోవాల్సిన వయస్సులో ఉన్న బాలబాలికలను పనుల్లో పెట్టకుండా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలను వినియోగించుకుని వారికి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు.చిన్నారులను ఉన్నత విద్యాభ్యాసం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరేలా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు కృషి చేయాలని ఆయన అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో డ్వాక్రా మహిళలు కీలక పాత్ర పోషించాలని, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంపొందించి చిన్నారుల హక్కులను పరిరక్షించాలని కోరారు.అలాగే ఎవరైనా చట్టవిరుద్ధంగా చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్నా లేదా వారితో పని చేయించినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సి.హెచ్. స్వరూప రాణి,న్యాయవాది జాట్రోత్.రవి నాయక్, ఇంద్రకాంతి పథకం సీసీ ప్రమీల, లీగల్ సర్వీస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?



దేశంలో రక్తహీనత, పోషకాహార లోపాలను అరికట్టేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం (పోషకాలతో కూడిన బియ్యం) పంపిణీ ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద 80 కోట్ల మందికి ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను 2028 డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ నిర్ణయం వల్ల కోట్లాది మంది లబ్ధిదారుల ఆరోగ్యం స్థితిగతులు మెరుగుపడతాయని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.

ఏమిటీ ఫోర్టిఫైడ్ బియ్యం?

ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ప్రత్యేకమైన వంగడం ఏమీ కాదు. మనం రోజూ తినే సాధారణ బియ్యానికే ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి కీలక సూక్ష్మ పోషకాలను జోడిస్తారు. ఈ ప్రక్రియలో బియ్యం గింజలపై పోషకాల పూత పూయడం లేదా పోషకాలతో కూడిన గింజలను సాధారణ బియ్యంలో కలపడం జరుగుతుంది. ఈ బియ్యం రుచి, వాసన, రంగులో సాధారణ బియ్యంలాగే ఉంటాయి. వండినప్పుడు కూడా ఎలాంటి తేడా ఉండదు.

ఎందుకింత ప్రాధాన్యం?

భారత్‌లో మహిళలు, పిల్లలతో సహా అన్ని వయసుల వారిలో ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత (అనీమియా) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (చీఖీనూ-5) గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో చాలా మందికి అన్నమే ప్రధాన ఆహారం. ఇడ్లీ, దోశ, పులావ్, కిచిడీ వంటి ఎన్నో రకాలుగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అందుకే, ప్రజల ఆహారపు అలవాట్లను మార్చకుండా, వారి రోజువారీ భోజనం ద్వారానే పోషకాలను అందించేందుకు ఫోర్టిఫికేషన్ ఒక సులభమైన, సమర్థవంతమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు ₹17,082 కోట్లు కేటాయించింది.

# హైదరాబాద్‌లో భారీ వర్షాలు - సీఎం రేవంత్ రెడ్డి విమానం దారి మళ్లింపు

హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లించాల్సి వచ్చింది. దిల్లీ నుంచి శంషాబాద్ వస్తున్న విమానాన్ని హైదరాబాద్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా బెంగళూరుకు డైవర్ట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 6.30 గంటలకు దిల్లీ నుంచి ఇండిగో విమానంలో బయలుదేరారు. హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడింది. దీంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు.

రహదారిపైకి భారీగా వరదనీరు : నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుసింది. చందానగర్, జేఎన్టీయూ, జీడిమెట్ల, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, నాంపల్లి, అబిడ్స్, బషీర్‌బాగ్, మియాపూర్, కేపీహెచ్‌బీ, సనత్‌నగర్, బోరబండ, పంజాగుట్ట, కోఠి, మలక్‌పేట, సరూర్‌నగర్, చంపాపేట, నారాయణగూడ ప్రాంతాల్లో వర్షం కురుసింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తున్నాయి. వర్షం కారణంగా అనేక చోట్ల ప్రధాన రహదారిపైకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం : నగరంలో పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన వానల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మన్సూరాబాద్‌లో ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. హిమాయత్‌నగర్, అఫ్జల్‌గంజ్, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బాలానగర్, జగద్గిరిగుట్ట, చింతల్, జీడిమెట్ల, సుచిత్ర, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, మల్లంపేట, కొంపల్లిలో ప్రాంతాల్లో వర్షం కురిసింది. మియాపూర్, లింగంపల్లి, మదీనాగూడ, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్, హైదర్‌నగర్, ప్రగతినగర్, బాచుపల్లి, కేపీహెచ్‌బీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసఫ్‌గూడ, మధురానగర్ ప్రాంతాల్లో వాన కురిసింది.

# అమెరికా-ఇరాన్ శాంతి సంకేతాలు...

# దుమ్మురేపిన స్టాక్ మార్కెట్లు



అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరవచ్చనే సానుకూల సంకేతాలతో శుక్రవారం భారత స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు దిగడంతో సెన్సెక్స్ ఓ దశలో 1,700 పాయింట్లకు పైగా దూసుకెళ్లగా, నిఫ్టీ తిరిగి 23,600 మార్కును అధిగమించింది. మార్కెట్లలో నెలకొన్న ఈ ఉత్సాహంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా పెరిగింది.
ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,695.40 పాయింట్లు (2.30%) లాభపడి 75,527.95 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 461.30 పాయింట్లు (1.99%) వృద్ధి చెంది 23,622.90 వద్ద ముగిసింది. ఇరాన్‌తో గొప్ప ఒప్పందం కుదిరిందని, పత్రాల ఖరారు మాత్రమే మిగిలి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గితే ఇంధన సరఫరాలు స్థిరపడతాయనే ఆశతో పెట్టుబడులు వెల్లువెత్తాయి.ఈ ర్యాలీలో దాదాపు అన్ని రంగాల షేర్లు రాణించాయి. ముఖ్యంగా నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు 3 శాతానికి పైగా లాభపడ్డాయి. శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టూబ్రో షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్లుగా నిలిచాయి. అయితే, నిఫ్టీ ఐటీ రంగం మాత్రం మిగిలిన రంగాలతో పోలిస్తే వెనుకబడింది. టెక్నికల్ పరంగా చూస్తే, నిఫ్టీ 23,800 స్థాయిని దాటితే 24,000 వైపు పయనించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 23,550–23,500 ప్రాంతం కీలక మద్దతుగా పనిచేస్తుందని విశ్లేషకులు తెలిపారు.




## ఐఐటీ మద్రాస్ అద్భుత ఆవిష్కరణ..

# మానవ బ్రెయిన్‌స్టెమ్‌కు 3డీ అట్లాస్




**ఐఐటీ మద్రాస్ నుంచి ప్రపంచంలోనే అత్యంత స్పష్టమైన బ్రెయిన్‌స్టెమ్ 3డీ అట్లాస్**

**'యాంకర్' పేరుతో ఈ డిజిటల్ మ్యాప్ ఆవిష్కరణ**

**మెదడు సంబంధిత వ్యాధులపై పరిశోధనలకు ఎంతగానో దోహదం**

**బ్రిక్స్ న్యూరోసైన్స్ సదస్సులో అధికారికంగా విడుదల**

**ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో గొప్ప ఆవిష్కరణ అని ప్రశంసలు**

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీ మద్రాస్) వైద్య శాస్త్ర రంగంలో ఒక కీలక మైలురాయిని సాధించింది. కణ స్థాయిలో మానవ బ్రెయిన్‌స్టెమ్‌కు సంబంధించి ప్రపంచంలోనే అత్యంత స్పష్టమైన 3డీ అట్లాస్‌ను ఆవిష్కరించింది. 'యాంకర్'గా నామకరణం చేసిన ఈ అట్లాస్, మెదడు సంబంధిత పరిశోధనలు, చికిత్సల కోసం అపూర్వమైన వనరుగా నిలవనుంది.

మానవ శరీరంలో శ్వాస, హృదయ స్పందన, నిద్ర వంటి కీలక విధులను నియంత్రించే మెదడులోని ప్రధాన భాగాన్ని 'బ్రెయిన్‌స్టెమ్' అంటారు. ఈ ప్రాంతంలో తలెత్తే స్వల్ప సమస్యలైనా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయి. ఐఐటీ మద్రాస్‌లోని సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్ అభివృద్ధి చేసిన ఈ 'యాంకర్' అట్లాస్... పిండం దశ నుంచి బాల్యం, వయోజన దశల వరకు మెదడులో చోటుచేసుకునే మార్పులను వివరిస్తుంది. ఇందులో 200కు పైగా బ్రెయిన్‌స్టెమ్ న్యూక్లియై, ఫైబర్ ట్రాక్టులను అత్యంత స్పష్టంగా 3డీ రూపంలో పొందుపరిచారు.

జూన్ 5 నుంచి 7 వరకు ఐఐటీ మద్రాస్ ప్రాంగణంలో జరిగిన 3వ బ్రిక్స్ న్యూరోసైన్స్ సింపోజియంలో ఈ అట్లాస్‌ను అధికారికంగా విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, వైద్య నిపుణుల సౌకర్యార్థం దీనిని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో డిజిటల్ రూపంలో ఉచితంగా అందుబాటులో ఉంచారు.

ఈ ఆవిష్కరణ న్యూరోబయాలజీ రంగంలో ఒక చారిత్రాత్మక విజయమని భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ ప్రశంసించారు. ఎంఆర్ఐ, హిస్టాలజీ వంటి బహుళ ఫ్రేమ్‌వర్క్‌లను ఏకీకృతం చేస్తూ ఈ అట్లాస్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ సంస్థల సహకారం, ప్రైవేట్ భాగస్వామ్యం, దాతల తోడ్పాటు కలిసి పనిచేస్తే ఇటువంటి అద్భుతమైన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని ఆయన కొనియాడారు. ఈ విజయంతో అంతర్జాతీయ న్యూరోసైన్స్ పరిశోధనలలో భారతదేశం ఒక కీలక స్థానాన్ని దక్కించుకుంది.

# ప్రపంచంలో వెళ్లకూడని 10 ప్రదేశాలు ఇవే!

**ప్రపంచంలో ప్రవేశం నిషేధించిన కొన్ని అత్యంత రహస్య ప్రదేశాలు**

**అమెరికా ఏరియా 51, చెయెన్నె మౌంటెన్ వంటి సైనిక రహస్య కేంద్రాలు**

**బ్రెజిల్ స్నేక్ ఐలాండ్, చెర్నోబిల్ ఎలిఫెంట్స్ ఫుట్ వంటి ప్రమాదకర ప్రాంతాలు**

**భారత్‌లోని నార్త్ సెంటినెల్, భూటాన్‌లోని గంగ్ఖర్ పుయెన్సమ్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు**

**చైనా చక్రవర్తి సమాధి, ఇటలీ పోవెగ్లియా ద్వీపం వంటి చారిత్రక నిషేధిత స్థలాలు**



సాంకేతికత ఎంత పెరిగినా, గూగుల్ ఎర్త్ ద్వారా ప్రపంచంలోని ఏ మూలనో చూడగలుగుతున్నా.. కొన్ని ప్రదేశాలు మాత్రం ఇప్పటికీ మానవ ప్రపంచానికి దూరంగా, అంతుచిక్కని రహస్యాలుగా మిగిలిపోయాయి. అత్యంత కట్టుదిట్టమైన భద్రత, ప్రాణాంతకమైన ప్రమాదాలు, పవిత్రమైన ఆధ్యాత్మిక కారణాలు, చారిత్రక సంరక్షణ వంటి అంశాల వల్ల ఈ ప్రదేశాలలోకి ప్రవేశం పూర్తిగా నిషేధించబడింది. ఆ ప్రదేశం లోపల ఏముందో తెలుసుకోవాలన్న కుతూహలం ప్రపంచవ్యాప్తంగా ఉన్నప్పటికీ, వాటి తలుపులు మాత్రం ఎప్పటికీ మూసే ఉంటాయి. అలాంటి 10 ప్రదేశాల గురించిన ఆసక్తికర కథనం ఇది.

1. ఏరియా 51, అమెరికా:
ఏరియా 51 పేరు వినగానే మనకు గుర్తుకొచ్చేవి గ్రహాంతరవాసులు (ఏలియన్స్), ఖగోళాలు. నెవాడా ఎడారిలో ఉన్న ఈ అత్యంత రహస్యమైన అమెరికన్ సైనిక స్థావరం, అత్యాధునిక విమానాలు, రక్షణ వ్యవస్థల పరీక్షలకు కేంద్రం. ఇక్కడికి దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించినా భారీ జరిమానాలు, అరెస్టులు తప్పవు. అందుకే దీని చుట్టుపక్కల ప్రాంతాన్ని "ఎక్స్‌ట్రాటెర్రెస్ట్రియల్ హైవే" నుండి మాత్రమే వీక్షించడానికి అనుమతిస్తారు.

2. చెయెన్నె మౌంటెన్ కాంప్లెక్స్, అమెరికా:
ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో అణుదాడిని సైతం తట్టుకునేలా కొలరాడోలోని గ్రానైట్ పర్వతం లోపల నిర్మించిన భూగర్భ సైనిక సముదాయం ఇది. ఇక్కడే నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ (నోరాడ్) కార్యకలాపాలు జరుగుతాయి. ఇది ప్రజలకు అందుబాటులో ఉండదు. కానీ, సమీపంలోని పార్కుల నుండి ఈ పర్వతాన్ని చూడవచ్చు.

3. రూమ్ 39, ఉత్తర కొరియా:
ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌లో ఉన్న ఈ రహస్య ప్రభుత్వ కార్యాలయం, ఆ దేశ పాలన కోసం అక్రమ మార్గాల్లో విదేశీ కరెన్సీని సంపాదిస్తుందని ఆరోపణలు ఉన్నాయి. కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రాంగణాలలో ఇది దాగి ఉంటుంది. ఉత్తర కొరియాకు వెళ్లే పర్యాటకులను కూడా ఈ ప్రాంతానికి చాలా దూరంగా ఉంచుతారు.

4. ది ఎలిఫెంట్స్ ఫుట్, ఉక్రెయిన్:
1986 చెర్నోబిల్ అణు విపత్తు తర్వాత ఏర్పడిన అత్యంత రేడియోధార్మిక వ్యర్థ పదార్థం ఇది. ఏనుగు పాదం ఆకారంలో ఉండటంతో దీనికి ఆ పేరు వచ్చింది. దశాబ్దాలు గడిచినా దీని దగ్గరకు వెళితే నిమిషాల్లో ప్రాణాలు పోతాయి. ప్రస్తుతం ఇది రియాక్టర్ లోపల సీల్ చేయబడింది. చెర్నోబిల్ ఎక్స్‌క్లూజన్ జోన్‌లోని కొన్ని సురక్షిత ప్రాంతాలకు మాత్రమే పరిమిత సంఖ్యలో పర్యాటకులను అనుమతిస్తారు.

5. స్నేక్ ఐలాండ్, బ్రెజిల్:
ఇది ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన సర్పాలకు నిలయం. అంతరించిపోతున్న జాతికి చెందిన వేలకొద్దీ గోల్డెన్ లాన్స్‌హెడ్ వైపర్ పాములు ఇక్కడ నివసిస్తాయి. వీటి విషం అత్యంత తీవ్రమైనది. అందుకే బ్రెజిల్ ప్రభుత్వం ఈ ద్వీపంలోకి ప్రజల ప్రవేశాన్ని నిషేధించింది. కేవలం శాస్త్రవేత్తలు మాత్రమే ప్రత్యేక అనుమతితో వెళ్లగలరు. పడవల్లో తీరం నుండి దూరంగా ఉండి ద్వీపాన్ని చూడవచ్చు.

6. నార్త్ సెంటినల్ ఐలాండ్, భారత్:
ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా వేల సంవత్సరాలుగా జీవిస్తున్న సెంటినలీస్ అనే ఆదిమవాసి తెగకు ఇది నివాసం. బయటి ప్రపంచంతో సంబంధాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. వారికి బయటి ప్రపంచం నుండి రోగాలు సోకకుండా, వారి జీవన విధానానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు భారత ప్రభుత్వం ఈ ద్వీపానికి వెళ్లడాన్ని చట్టవిరుద్ధం చేసింది.

7. గంగ్ఖర్ పుయెన్సమ్, భూటాన్:
ప్రపంచంలో ఇప్పటివరకు ఎవరూ అధిరోహించని అత్యంత ఎత్తైన పర్వతం (7,500 మీటర్లు) ఇది. స్థానిక ప్రజలు ఈ పర్వత శిఖరాలను తమను రక్షించే దేవతల పవిత్ర నివాసాలుగా భావిస్తారు. వారి ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ భూటాన్ ప్రభుత్వం ఈ పర్వతారోహణను నిషేధించింది. దీనిని ట్రెక్కింగ్ మార్గాల నుండి లేదా విమానాల నుండి వీక్షించవచ్చు.

8. ఇసే గ్రాండ్ ష్రైన్, జపాన్:
జపాన్‌లో అత్యంత పవిత్రమైన షింటో పుణ్యక్షేత్రం ఇది. సూర్య దేవత అమతెరాసు కోసం దీన్ని నిర్మించారు. ఇక్కడి గర్భగుడిలోకి కేవలం రాజ కుటుంబ సభ్యులు, ప్రధాన పూజారులు మాత్రమే ప్రవేశించగలరు. బయటి ప్రాంగణాలు సందర్శకులకు తెరిచి ఉంటాయి. ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి ఈ ఆలయాన్ని సంప్రదాయబద్ధంగా పునర్నిర్మిస్తారు.

9. క్విన్ షి హువాంగ్ సమాధి, చైనా:
చైనా మొదటి చక్రవర్తి సమాధి ఇది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన టెర్రకోట సైన్యం ఈ సమాధిని కాపలా కాస్తుంటుంది. సమాధి లోపల పాదరసం అధిక స్థాయిలో ఉండటం, పురావస్తు సంపదను కాపాడాలనే ఉద్దేశంతో దీనిని ఇప్పటివరకు తెరవలేదు. పర్యాటకులు టెర్రకోట సైన్యాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను సందర్శించవచ్చు.

10. పోవెగ్లియా ఐలాండ్, ఇటలీ:
వెనీషియన్ లాగూన్‌లోని ఈ చిన్న ద్వీపానికి ఓ చీకటి చరిత్ర ఉంది. ఒకప్పుడు ప్లేగు వ్యాధిగ్రస్తులను ఇక్కడ ఉంచి, ఆ తర్వాత మానసిక వైద్యశాలగా మార్చారు. ఇక్కడ దెయ్యాలు తిరుగుతాయని, భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వదంతులు ఉన్నాయి. ప్రమాదకరంగా మారడంతో ప్రభుత్వం దీన్ని అధికారికంగా మూసివేసింది.

ఈ ప్రదేశాలన్నింటికీ ప్రవేశం లేకపోవడమే వాటిపై ఆసక్తిని, రహస్యాన్ని మరింత పెంచుతోంది. అందుకే "పెరిమీటర్ టూరిజం" అనే కొత్త పర్యాటక విధానం ప్రాచుర్యం పొందింది. అంటే, చట్టబద్ధంగా ఎంతవరకు వెళ్లవచ్చో అంతవరకు వెళ్లి ఆ ప్రదేశాలను దూరం నుంచే వీక్షించడం. భద్రత, గౌరవం లేదా ప్రమాదం.. కారణం ఏదైనా, కొన్ని రహస్యాలు మానవుడికి అంతుచిక్కకుండా ఉంటేనే వాటికి విలువ.

# 2027 జనాభా లెక్కల తర్వాత భారత ఎన్నికల ముఖచిత్రమే మారనుందా?



: దాదాపు 50 ఏళ్ల తర్వాత భారత ఎన్నికల వ్యవస్థలో అతిపెద్ద మార్పులకు తెరలేచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2027 జనాభా లెక్కల అనంతరం చేపట్టే డీలిమిటేషన్ ప్రక్రియ (నియోజకవర్గాల పునర్విభజన) దేశ రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసే అవకాశం ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో పాటు పార్లమెంటు సీట్ల సంఖ్య కూడా భారీగా పెరగొచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (జూనాప్రాజీ) కోసం ప్రముఖ ఆర్థిక వేత్తలు షమికా రవి, ముదిత్ కపూర్ ఈ స్టడీ చేశారు. ఈ అధ్యయనం ప్రకారం- డీలిమిటేషన్‌ను కేవలం జనాభా ఆధారంగానే కాకుండా పట్టణీకరణ, భాషా వైవిధ్యం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని నిర్వహిస్తే అప్పుడు ఓటర్ల భాగస్వామ్యం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**డీలిమిటేషన్ అంటే ఏంటి?**

జనాభా మార్పులకు అనుగుణంగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల్ని పునర్నిర్మించడమే డీలిమిటేషన్. ప్రస్తుతం రాష్ట్రాల వారీగా లోక్‌సభ సీట్ల కేటాయింపు 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ నుంచి యథాతథంగా కొనసాగుతోంది. 2001 జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల సరిహద్దులు మారినా, రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల సంఖ్య మాత్రం మారలేదు. 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌తో దాదాపుగా 50 ఏళ్ల తర్వాత సీట్ల కేటాయింపును పునర్‌పరిశీలించే అవకాశం ఏర్పడనుంది.

**543 నుంచి 824 సీట్లకు**

ఎకనామిస్ట్ స్టడీ ప్రకారం, ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ నియోజకవర్గాల్ని పునర్విభజించడం ద్వారా వాటి సంఖ్య 824 కు పెరిగే అవకాశం ఉంది. ఇందుకోసం 59 నియోజకవర్గాల్ని రెండుగా విభజించడం, 111 నియోజకవర్గాల్ని మూడుగా విభజించే విధానాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ హైదరాబాద్, సికింద్రాబాద్, కోల్‌కతా దక్షిణ్ వంటి మెట్రోపాలిటన్ నియోజకవర్గాలతో పాటు కొన్ని ద్వితీయ శ్రేణి పట్టణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు కూడా పునర్విభజనకు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ మార్పుల వల్ల జాతీయ స్థాయిలో ఓటింగ్ శాతం 0.3 నుంచి 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు అంచనా వేశారు. దీనికి అనుగుణంగా సాధారణ ఎన్నికల్లో సుమారు 90 లక్షల నుంచి 2.3 కోట్ల మంది వరకు ఓటర్ల సంఖ్య పెరుగుతుందని నివేదిక చెబుతోంది. సాధారణంగా పెద్ద నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందని భావిస్తుంటారు. కానీ తాజా అధ్యయనం ప్రకారం అసలు సమస్య నియోజకవర్గం పరిమాణం కాదంట. పట్టణీకరణ, ఎస్సీ- ఎస్టీ జనాభా శాతం, భాషా వైవిధ్యం వంటి అంశాలే ఓటింగ్ శాతాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నట్లు తేలింది.

**పట్టణాల్లో మహిళా ఓటర్లే వెనుకంజ**

ఇదే స్టడీలో మరొక ఆసక్తికర అంశం బయటికి వచ్చింది. పూర్తిగా పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలు ఓటింగ్‌లో చాలా వెనుకబడి ఉన్నారని పరిశోధకులు గుర్తించారు. గ్రామీణ మహిళలతో పోల్చి చూస్తే పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతం సగటున 5 శాతం తక్కువగానే ఉంటున్నట్లు అంచనా వేశారు. ఇక్కడ ప్రధానంగా ఉద్యోగంలో ఒత్తిడి, ప్రయాణ భారాలు, కుటుంబ బాధ్యతలు వంటివి కారణాలుగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.

**ఎన్నికల సంఘానికి కీలక సూచనలు**

ఓటింగ్ శాతం పెంచేందుకు ఈ ఇరువురు ఆర్థికవేత్తలు ఎన్నికల సంఘానికి పలు కీలక సూచనలు చేశారు. మెట్రో నగరాల్లో మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేయడం సహా సాయంత్రం వేళల్లో పోలింగ్ సమయాన్ని పొడిగించాలని ప్రతిపాదించారు. పోలింగ్ కేంద్రాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం, అంగన్‌వాడీలు, స్వయం సహాయక సంఘాలు, ఆశా వర్కర్ల ద్వారా మహిళా ఓటర్లలో అవగాహన పెంపొందించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఘోర విషాదం : క్యాన్సర్‌తో తమ్ముడు మృతి- బాధతో చనిపోయిన అన్న- ఒకేరోజు ఇద్దరి అంత్యక్రియలు



విధి కొన్ని సార్లు మనుషుల బంధాల్ని కూడా పరీక్షిస్తుంటుంది. చిన్నప్పటి నుంచి నీడలా కలిసే పెరిగారు. కలిసే వ్యవసాయం చేశారు. ఒకే ఇంట్లోని అక్కాచెల్లెళ్లను ఒకే రోజు పెళ్లి చేసుకున్నారు. జీవితమంతా ఇలా ఒకరికొకరు అండగా నిలిచిన ఆ అన్నాదమ్ముళ్లు చివరికి ఒకే రోజు లోకాన్ని విడిచి వెళ్లారు. ఒకే ఇంటి నుంచి రెండు పాడెలు ఒకేసారి బయలుదేరడం, ఒకేసారి ఇద్దరి అంత్యక్రియలు జరగడం పంజాబ్‌లోని ఓ గ్రామంలో విషాదాన్ని నింపింది.

పంజాబ్ లుధియానా జిల్లా సమ్రాలా సమీపంలోని భంగ్లాన్ గ్రామంలో ఈ విషాద ఘటన జరిగింది. 45 ఏళ్ల గుర్దీప్ సింగ్ చాలా కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు అతడికి చికిత్స అందించగా ఆరోగ్యం కొంత మెరుగైనప్పటికీ, 15 రోజుల కిందట మళ్లీ పరిస్థితి విషమించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చివరికి గుర్దీప్ కన్నుమూశాడు.

**తమ్ముడు లేడన్న బాధతో అన్న కూడా**

ఇక ఆ తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక గుర్దీప్ అన్న గుర్జిత్ సింగ్ తీవ్ర విషాదంలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఓదార్చేందుకు ఎంతగా ప్రయత్నించినా అతడ్ని ఆపలేకపోయారు. తాను ప్రాణంగా ప్రేమించే తమ్ముడు లేడన్న బాధను భరించలేకపోయాడు. తమ్ముడు లోకాన్ని విడిచిన కొన్ని గంటల వ్యవధిలోనే అర్ధరాత్రి సమయంలో గుర్జిత్ సింగ్‌కు గుండెపోటు రావడంతో ఆయన కూడా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఒకే రోజున ఇద్దరు కుమారుల్ని కోల్పోయిన కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామస్థులు షాక్‌కు గురయ్యారు.

**ఒకే రోజు ఒకే ఇంటి అక్కాచెల్లెళ్లతో పెళ్లి- ఇప్పుడు చావులోనూ!**

గ్రామస్థుల ప్రకారం- ఆ సోదరులు చిన్నప్పటి నుంచి అన్ని సమయాల్లో కలిసే ఉండేవారు. పొలాలకు వెళ్లినా, ఇతర పనులకు వెళ్లినా, గ్రామంలో ఏదైనా వేడుకకు హాజరైనా ఇద్దరూ కలిసే వెళ్లేవారు. అంతే కాదు ఇద్దరూ ఒకే రోజు ఒకే ఇంటికి చెందిన అక్కాచెల్లెళ్లను వివాహం చేసుకోవడం విశేషం. ఇద్దరూ కలిసి గుర్రాలపై పెళ్లి ఊరేగింపులో కూడా ఒకేసారి పాల్గొన్నారు. అలాంటి చక్కటి అనుబంధం ఉన్న సోదరులు ఇద్దరూ ఒకేరోజు చనిపోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

'ఇలాంటి ఘటనను జీవితంలో ఎప్పుడూ చూడలేదు. ఇద్దరూ కలిసి వ్యవసాయం చేశారు. కలిసే వ్యాపారం చేశారు. ఒకరు లేకుండా మరొకరు ఉండలేరని అందరికీ తెలుసు. ఇప్పుడు ఇద్దరూ ఒకే రోజు వెళ్లిపోవడం తట్టుకోలేకపోతున్నాం' అని బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. జిల్లా రైతు సంఘం నాయకుడు సుఖ్విందర్ సింగ్ బగ్గా తెలిపిన వివరాల ప్రకారం, కేంద్రం గతంలో తెచ్చిన సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలోనూ ఇద్దరు సోదరులు టిక్రీ సరిహద్దులో ఏడాదికిపైగా పాల్గొన్నారు. వ్యవసాయ చట్టాల ఉపసంహరణ వరకూ ఉద్యమంలోనే కొనసాగారు.

సోదరులిద్దరి మృతదేహాలకు గ్రామ శ్మశానవాటికలో ఒకే రోజు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే ఇంటి నుంచి రెండు పాడెలు ఒకేసారి బయటికి రావడం, ఒకేసారి రెండు చితులు వెలగడం అక్కడున్న వారందరినీ కన్నీళ్లు పెట్టించింది. సోదరుల మరణంతో వారి కుటుంబంలోనూ విషాదం అలుముకొంది. గుర్జిత్ సింగ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, గుర్దీప్ సింగ్‌కు ఒక కుమారుడు ఉన్నాడు. ఇద్దరూ ఒకే రోజున కన్నుమూయడంతో ఆ చిన్నారులు తమ తండ్రుల కోసం విలపించడం చూస్తున్న వారికీ కన్నీళ్లు తెప్పించింది. జీవితమంతా కలిసి నడిచిన ఇద్దరు సోదరులు, చివరి ప్రయాణాన్ని కూడా కలిసి సాగించడం గ్రామస్థుల హృదయాల్ని కలిచివేసింది.ం

## సముద్రంలో ప్రయాణించే నేవీ సైనికులు ఎలాంటి ఫుడ్ తీసుకుంటారో తెలుసా?

**సుదీర్ఘ సముద్ర ప్రయాణాల్లో నేవీ సైనికుల ఆహారపు అలవాట్లు**

**వారి మెనూలో ఆరు రకాల పదార్థాలకు అధిక ప్రాధాన్యం**

**తాజా సరుకులు అయిపోయాక నిల్వ చేసిన ఆహారంపైనే ఆధారం**

**శక్తి, పోషణ, సౌలభ్యం ఆధారంగా ఆహార ఎంపిక**

నెలల తరబడి సముద్రంలో, బయటి ప్రపంచంతో పెద్దగా సంబంధం లేకుండా గడిపే నావికాదళ సిబ్బంది జీవితం ఎంతో కఠినంగా, సవాలుతో కూడుకున్నది. నిరంతరం కదులుతూ ఉండే నౌకలు, వేళాపాళా లేని విధులు, ఒత్తిడితో కూడిన పరిస్థితుల మధ్య వారి ఆరోగ్యాన్ని, మానసిక స్థైర్యాన్ని కాపాడటంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో, సుదీర్ఘ ప్రయాణాల్లో అమెరికా నావికాదళ అధికారులు, సైనికులు ఎలాంటి ఆహారం తీసుకుంటారనే విషయంపై ఆసక్తికరమైన వివరాలు వెల్లడయ్యాయి.

సాధారణంగా నౌక ప్రయాణం మొదలైన తొలి రెండు వారాల పాటు మాత్రమే తాజా పండ్లు, కూరగాయలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆ తర్వాత నెల తరబడి నిల్వ ఉండే ఆహార పదార్థాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. టిన్ ఫుడ్, డ్రై ఫుడ్, ఫ్రోజెన్ పదార్థాలతోనే వారి భోజనం ముడిపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరు రకాల ఆహార పదార్థాలు వారి మెనూలో తప్పనిసరిగా ఉంటాయని, ఇవి కేవలం పోషకాలను అందించడమే కాకుండా వారిలో స్ఫూర్తిని నింపుతాయని నివేదికలు చెబుతున్నాయి.

అమెరికా నావికాదళ అధికారికంగా వెల్లడించిన ఫ్లీట్ అండ్ ఫ్యామిలీ రెడీనెస్ సమాచారం ఆధారంగా, టైమ్స్ ఆఫ్ ఇండియా ఇటీవల ఓ కథనాన్ని ప్రచురించింది.

మెనూలో కీలకమైన ఆరు పదార్థాలు:

1. ఓట్‌మీల్: ఉదయం పూట అల్పాహారంలో ఇది ప్రధానమైనది. తక్కువ స్థలంలో ఎక్కువ మొత్తంలో నిల్వ చేయవచ్చు. సిబ్బంది అందరికీ సులభంగా వండటానికి వీలవుతుంది. ఇది రోజంతా పనిచేయడానికి అవసరమైన శక్తిని నిరంతరాయంగా అందిస్తుంది.
2. గుడ్లు: ప్రోటీన్ కోసం గుడ్లను ఎక్కువగా వినియోగిస్తారు. వీటిని రకరకాలుగా వండవచ్చు. ఆమ్లెట్ రూపంలో లేదా శాండ్‌విచ్‌లలో పెట్టి వేగంగా సర్వ్ చేయడానికి అనువుగా ఉంటాయి.
3. బేగెల్, బిస్కెట్ శాండ్‌విచ్‌లు: విధులకు వెళ్లే సమయంలో లేదా మధ్యలో తినడానికి ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి. గుడ్లు లేదా చీజ్‌తో కలిపి వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది.
4. పండ్లు, యోగర్ట్: నిల్వ చేసిన ఆహారం ఎక్కువగా తీసుకునే సమయంలో తాజాదనం కోసం, పోషకాల సమతుల్యం కోసం పండ్లు, యోగర్ట్ ఉపయోగపడతాయి.
5. ట్రయిల్ మిక్స్, గ్రానోలా బార్స్: సుదీర్ఘమైన షిఫ్టుల సమయంలో తక్షణ శక్తి కోసం ఈ స్నాక్స్ ఎంతగానో ఉపయోగపడతాయి.
6. కాఫీ, టీ: సిబ్బందికి చురుకుగా, అప్రమత్తంగా ఉంచడంలో కాఫీ, టీ కీలక పాత్ర పోషిస్తాయి. అలసటను దూరం చేసి, సహోద్యోగులతో కలిసి కాఫీ తాగడం వారిలో స్నేహభావాన్ని, మానసిక ఉత్సాహాన్ని పెంచుతుంది.

# జపనీయుల జీవన సూత్రాలు..!
# మీ జీవితం మారిపోవడం ఖాయం..!

జపనీయులు తమ విశిష్టమైన సంస్కృతి, క్రమశిక్షణ, అంకితభావం, జీవనశైలితో ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తారు. వారు సమయపాలనకు ప్రాణం ఇస్తారు. సాంకేతికతలో ప్రపంచాన్ని శాసిస్తున్నప్పటికీ, వారు తమ మూలాలను, సంప్రదాయాలను అస్సలు మర్చిపోరు. పెద్దవారి అనుభవం, జ్ఞానం, వారి సలహాలను ఎంతో గౌరవంగా జీవిస్తారు. జపనీయుల ఆరోగ్యం, దీర్ఘాయుష్షు గురించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇక్కడ చూద్దాం:

ప్రపంచంలో అత్యధిక ఆయుర్దాయం కలిగిన దేశాల్లో జపాన్ ఒకటి. అక్కడి ప్రజలు కేవలం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మాత్రమే కాకుండా.. వారి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, ఆలోచనా విధానం వల్ల సంతోషంగా, ఆరోగ్యంగా జీవిస్తున్నారు. జపనీయుల కొన్ని ప్రత్యేక అలవాట్లను మనం కూడా అలవాటు చేసుకుంటే.. అవి మన జీవితాన్నీ మరింత సంతృప్తికరంగా మార్చే అవకాశముంది. జపనీయులు వందేళ్లు దీర్ఘాయుష్షుతో జీవించేందుకు దోహదపడుతున్న అద్భుతమైన జీవన సూత్రాలు ఇవే.

1. జీవితానికి ఒక బలమైన లక్ష్యం ఉండాలి

జపనీయులలో చాలా మంది 'ఇకిగాయ్' అనే జీవన విధానాన్ని అనుసరిస్తారు. అంటే.. జీవితం ఏదో నడిచిపోతోందని కాకుండా.. జీవితాన్ని సార్థకం చేసుకోవాలనే బలమైన లక్ష్యంతో వారు జీవిస్తారు. ఉదయం నిద్రలేవగానే ఉత్సాహంగా ఆ రోజును ప్రారంభించేందుకు ఒక కారణం ఉండాలని వారు నమ్ముతారు. ఇష్టమైన పని, మన ప్రతిభ, సమాజానికి ఉపయోగపడే అంశాలు కలిసే చోటే నిజమైన ఆనందం దాగి ఉంటుందని జపనీయులు నమ్ముతారు.

2. ప్రస్తుత క్షణంలో జీవించడం

గతం గురించి బాధపడటం, భవిష్యత్తు గురించి ఆందోళన చెందడం కంటే ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించడంపై జపనీయులు ఎక్కువగా దృష్టి పెడతారు. కళాత్మక కార్యక్రమాలు, ధ్యానం వంటి అలవాట్లపై వారు దృష్టిసారిస్తారు. ఇవి మానసిక ప్రశాంతతను పెంచుతాయి.

3. తక్కువ వస్తువులతో హాయిగా జీవించడం

జపాన్‌లో మినిమలిజం ఒక జీవన విధానం. అవసరం లేని వస్తువులను ఇంట్లో నిల్వ చేయకుండా, అవసరమైన వాటినే ఉంచడం వల్ల మనసు కూడా ప్రశాంతంగా ఉంటుంది. తక్కువ వస్తువులతో ఎక్కువ సంతోషం అనే జీవన విధానానికి వారు ప్రాధాన్యత ఇస్తారు.

4. ఆరోగ్యాన్ని కాపాడే ఆహారపు అలవాట్లు

మానసిక, శారీరక ఆరోగ్యానికి జపనీయులు చాలా ప్రాధాన్యత ఇస్తారు. తాజా కూరగాయలు, చేపలు, సీఫుడ్, తృణధాన్యాలు జపనీయుల ఆహారంలో ప్రధాన భాగంగా ఉంటాయి. ఎక్కువ నూనె, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండడం వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారు. ఈ పోషకాహార అలవాట్లే వారి దీర్ఘాయువు, ఆరోగ్యం వెనకున్న రహస్యం.

5. ఇంట్లో ప్రశాంత వాతావరణాన్ని సృష్టించుకోవడం




బిజీ జీవితంలో కూడా ఇంటిని ప్రశాంతతకు నిలయంగా మార్చుకోవడం జపనీయులకున్న ఓ గొప్ప అలవాటు. సరైన వెలుతురు, శుభ్రమైన పరిసరాలు, కుటుంబ సభ్యులతో గడిపేందుకు వారు ఎక్కువగా ఇష్టపడుతారు. దీని ద్వారా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుంటారు.

6. ప్రతిరోజూ కొంచెం మెరుగుపడటం

ఒక్కసారిగా పెద్ద మార్పులు చేయడం కంటే ప్రతిరోజూ చిన్న చిన్న మెరుగుదలలు చేసుకుంటూ ముందుకు సాగాలని "కైజెన్" తత్వం చెబుతుంది. ఈ అలవాటు జీవితంలో స్థిరమైన విజయాలకు దారి తీస్తుంది.

7. ప్రకృతికి దగ్గరగా ఉండటం

చెట్లు, పూలు, ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు జపనీయులు ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తారు. అడవుల్లో నడకలు, చెర్రీ బ్లాసమ్ పూల అందాలను వీక్షించడం వంటి కార్యక్రమాలు ఒత్తిడిని తగ్గిస్తాయి.

8. అతిథులను హృదయపూర్వకంగా ఆహ్వానించడం

"ఒమొటెనాషి" అనే భావన ప్రకారం అతిథులను ఎలాంటి స్వార్థం లేకుండా గౌరవంగా చూసుకోవడం జపాన్ సంస్కృతిలో భాగం. ఇది మనుషుల మధ్య బలమైన బంధాలను ఏర్పరుస్తుంది.

9. క్రమశిక్షణ, సమయపాలన

సమయానికి విలువ ఇవ్వడం, క్రమశిక్షణ, బాధ్యతతో వ్యవహరించడం, కష్టపడి పనిచేయడం జపనీయుల ప్రధాన లక్షణాలు. అందుకే ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో జపాన్ ఒకటిగా నిలిచింది.

10. కష్టాల నుంచి తిరిగి నిలబడే శక్తి

భూకంపాలు, సునామీలు వంటి ఎన్నో ప్రకృతి విపత్తులను ఎదుర్కొన్నప్పటికీ జపాన్ ప్రజలు ధైర్యం కోల్పోలేదు. పట్టుదలతో పరిస్థితులకు అనుగుణంగా మారి.. ప్రతిసారి మరింత బలంగా తిరిగి నిలబడటం వారి ప్రత్యేకత. జపనీయుల పట్టుదల అందరికీ ఆదర్శం.

11. పెద్దలకు గౌరవం ఇవ్వడం

జపాన్ సంస్కృతిలో పెద్దలను గౌరవించడానికి అత్యున్నత స్థానం ఉంటుంది. వయసుతో వారు పొందిన అనుభవం, జ్ఞానాన్ని ఎంతో గౌరవిస్తారు. వారిచ్చే సలహాలను అత్యంత విలువైనవిగా భావిస్తారు. దీనివల్ల వారి కుటుంబ బంధాలు తరతరాలుగా బలంగా ఉంటాయి.

12. ప్రతి పనిలో నాణ్యతకు ప్రాధాన్యత

చిన్న పనైనా, పెద్ద పనైనా అత్యంత శ్రద్ధతో చేయడం జపనీయుల లక్షణం. అందుకే వారి ప్రొడక్టులు, సేవలు ప్రపంచవ్యాప్తంగా నాణ్యతకు మారుపేరుగా నిలుస్తాయి. ఏ పని చేసినా అంకితభావంతో, నాణ్యతతో చేయాలన్న వారి లక్షణం మనం కూడా అలవాటు చేసుకోదగినది.

13. లోపాల్లోనూ అందాన్ని చూడడం

'వాబి-సాబి' అనేది ఒక అద్భుతమైన జపనీస్ జీవన తత్వం. జీవితంలో ఏదీ శాశ్వతం కాదు.. ఏదీ పర్ఫెక్ట్ కాదు. జీవితంలో లోపాలను, కాలానుగుణంగా వచ్చే మార్పులను కూడా జీవితంలో భాగంగా స్వీకరించడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం, క్రమశిక్షణ, ప్రకృతితో అనుబంధం, మానసిక ప్రశాంతత వంటి విలువలను జపనీయులు తమ దైనందిన జీవితంలో భాగం చేసుకున్నారు. వారి ఈ జీవన సూత్రాల్లో కొన్నింటినైనా మనం అలవర్చుకుంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం, సంతృప్తి కలుగుతుంది. చిన్న చిన్న మార్పులతో ప్రారంభిస్తే, పెద్ద విజయాలు సాధించడం కష్టమేమీ కాదు.

# ప్రపంచంలోనే అత్యంత విషపూరితమైన పాము ఇదే... రంగులు కూడా మార్చుతుంది!

ప్రపంచంలోనే అత్యంత విషపూరితమైన పాముగా గుర్తింపు పొందిన ఇన్‌ల్యాండ్ తైపాన్, మారుతున్న కాలాలకు అనుగుణంగా తన చర్మం రంగును మార్చుకుంటుంది. ఆస్ట్రేలియాలోని కఠినమైన వాతావరణ పరిస్థితులలో శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించుకోవడానికి ఈ పాము ప్రదర్శించే ఈ విలక్షణ లక్షణం ఒక అద్భుతమైన జీవశాస్త్ర అనుసరణగా నిలుస్తోంది. శీతాకాలంలో ఈ పాము ముదురు రంగులోకి, ముఖ్యంగా తల భాగంలో నలుపు రంగులోకి మారుతుంది. తద్వారా ఉదయం వేళ తక్కువగా ఉండే సూర్యరశ్మిని సమర్థంగా గ్రహించి శరీరాన్ని వేగంగా వేడెక్కించుకుంటుంది. అదే, వేసవిలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటినప్పుడు, ఇది లేత గోధుమ లేదా పసుపు రంగులోకి మారుతుంది. ఈ లేత రంగు సూర్యరశ్మిని పరావర్తనం చెందించి, శరీరం అతిగా వేడెక్కకుండా రక్షిస్తుంది. ఇది ఒక రకంగా ప్రకృతి సిద్ధమైన థర్మోస్టాట్‌లా పనిచేస్తుంది. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్, దక్షిణ ఆస్ట్రేలియా ప్రాంతాల్లోని మారుమూల నల్ల రేగడి నేలల్లో ఈ ఇన్‌ల్యాండ్ తైపాన్ నివసిస్తుంది. దీని విషం అత్యంత ప్రాణాంతకమైనప్పటికీ, స్వతహాగా ఇది చాలా సిగ్గరి



మరియు మనుషులకు దూరంగా ఉంటుంది. ఇప్పటివరకు ఈ పాము కాటుకు గురై ఎవరూ మరణించలేదని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ పాము కాటు బాధితులకు సకాలంలో యాంటీవీనమ్ చికిత్స అందించడం ద్వారా విజయవంతంగా కాపాడగలిగారు. ఆస్ట్రేలియన్ మ్యూజియం, ఆస్ట్రేలియన్ రెప్టైల్ పార్క్ నివేదికల ప్రకారం, ఈ పాము తల భాగంలో రంగు మార్పు అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది. గడ్డు పరిస్థితుల్లో జీవించడానికి ఈ జీవి అలవర్చుకున్న ఈ అద్భుతమైన గుణం శాస్త్రవేత్తలను విశేషంగా ఆకర్షిస్తోంది.

# టీవీ, రేడియో ప్రసారాలకు కొత్త రూల్స్.. ఏకీకృత విధానం దిశగా కేంద్రం

దేశంలోని టెలివిజన్, రేడియో ప్రసార రంగంలో భారీ సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న అనేక మార్గదర్శకాలను ఒకే గొడుగు కిందకి తీసుకొస్తూ 'టెలికమ్యూనికేషన్స్ (టెలివిజన్, రేడియో, అనుబంధ సేవలు) రూల్స్, 2026' పేరుతో ముసాయిదా నియమావళిని విడుదల చేసింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. కొత్త టెలికమ్యూనికేషన్స్ చట్టం-2023కు అనుగుణంగా ఈ మార్పులు చేపట్టినట్టు తెలిపింది.

ఈ కొత్త ముసాయిదా నిబంధనలతో ప్రసార పరిశ్రమకు ఏకీకృత, అత్యంత సరళీకృత నియమావళి అందుబాటులోకి వస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. టీవీ, రేడియో ప్రసార రంగంలో వ్యాపార సరళీకరణను (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ప్రోత్సహించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ కొత్త నియమావళి అమల్లోకి వస్తే, ప్రస్తుతం ఉన్న అనేక పాత గైడ్‌లైన్స్ రద్దవుతాయి.

ఒకే గొడుగు కిందకి రానున్న సేవలు

ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న పలు విధానాలను ఈ కొత్త ముసాయిదాలో విలీనం చేశారు. వాటిలో ముఖ్యమైనవి:

శాటిలైట్ టెలివిజన్ ఛానళ్ల అప్ లింకింగ్, డౌన్ లింకింగ్ మార్గదర్శకాలు.

డైరెక్ట్-టు-హోమ్ (డీటీహెచ్) బ్రాడ్‌కాస్టింగ్ సేవల లైసెన్సింగ్ విధానాలు.



హెడ్‌ఎండ్-ఇన్-ది-స్కై (హెచ్ఐటీఎస్) ప్రసార సేవల మార్గదర్శకాలు.

ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఎఫ్ఎం రేడియో సేవల విస్తరణ (ఫేజ్) విధానాలు.

కమ్యూనిటీ రేడియో స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలు.

కొత్త ముసాయిదాలోని కీలక అంశాలు

ఈ ముసాయిదాలో పలు కీలక సంస్కరణలను ప్రతిపాదించారు. అన్ని రకాల అనుమతుల ప్రక్రియను డిజిటల్ రూపంలోకి మార్చనున్నారు. అనుమతుల కోసం గతంలో తప్పనిసరిగా ఉన్న 'గ్రాంట్ ఆఫ్ పర్మిషన్ అగ్రిమెంట్' (జీఓపీఏ) పద్ధతిని తొలగించారు. దీనివల్ల విధానాలు మరింత సులభతరం కానున్నాయి. ఏదైనా వివాదాలు తలెత్తితే వాటి పరిష్కారం కోసం పారదర్శక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్పులన్నీ ప్రసార రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేస్తాయని కేంద్రం విశ్వాసం వ్యక్తం చేసింది.

ఈ ముసాయిదా నియమావళిని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో ప్రజలు, ఇతర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. దీనిపై సూచనలు, సలహాలు, లేదా అభిప్రాయాలను జులై 27వ తేదీలోగా మంత్రిత్వ శాఖలోని అండర్ సెక్రటరీ (బీపీ&ఎల్)కి పంపాలని కోరారు.

# దేశంలో భయం సృష్టించేందుకు దావూద్ ముఠా స్కెచ్.. హెచ్చరించిన ఐబీ




భారత్‌లో అశాంతిని రేకెత్తించేందుకు అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు చెందిన డి-కంపెనీ మరో భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు హెచ్చరించాయి. దేశవ్యాప్తంగా వరుసగా 'టార్గెట్ కిల్లింగ్స్' చేసేందుకు ఉత్తర భారతదేశం సహా ఇతర ప్రాంతాల నుంచి షార్ప్‌షూటర్లను ఈ ముఠా రిక్రూట్ చేసుకుంటున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముఠా ప్రముఖులను కాకుండా, స్థానికంగా పలుకుబడి కలిగిన సామాన్య పౌరులనే లక్ష్యంగా చేసుకుంటోంది. వరుస హత్యల ద్వారా ప్రజల్లో నిరంతర అభద్రతా భావాన్ని, భయాందోళనలను కలిగించడమే వీరి ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఎవరినైనా లక్ష్యంగా చేసుకోవచ్చనే హెచ్చరికలను పంపి, స్థానికంగా తీవ్ర గందరగోళం సృష్టించాలని వారు యత్నిస్తున్నారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, యూపీ ఏటీఎస్, ఎన్ఐఏ సంయుక్తంగా దావూద్‌కు చెందిన ఉగ్రవాద ముఠాను ఛేదించిన కొద్ది రోజులకే ఈ కొత్త కుట్ర వెలుగులోకి రావడం గమనార్హం. పాకిస్థాన్ నుంచి దావూద్ ప్రధాన అనుచరుడు మున్నా జింగాడా (సయ్యద్ ముజాకిర్ ముద్దసర్ హుస్సేన్) ఈ కొత్త నెట్‌వర్క్‌ను పర్యవేక్షిస్తున్నట్లు దర్యాప్తు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. పంజాబ్, ముంబై, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి షార్ప్‌షూటర్లను నియమించుకుని, అధికారులకు అనుమానం రాకుండా వారిని సొంత రాష్ట్రాల వెలుపల దాడులకు పురమాయిస్తున్నట్లు తెలుస్తోంది.

నిఘా వర్గాల హెచ్చరికలతో దేశవ్యాప్తంగా భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఉగ్రవాద-నేరపూరిత నెట్‌వర్క్‌ల నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఈ కొత్త నెట్‌వర్క్ ద్వారా ఎలాంటి హత్యలు జరిగినట్లు నిర్ధారణ కాలేదని, అయినప్పటికీ ముప్పు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు.

# ఉత్తర కొరియాపైకి డ్రోన్లు: మాజీ అధ్యక్షుడికి 30 ఏళ్ల జైలు శిక్ష

**దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్‌కు 30 ఏళ్ల జైలు**
**ఉత్తర కొరియాపై డ్రోన్లు పంపిన కేసులో సియోల్ కోర్టు తీర్పు**
**మార్షల్ లా విఫలం కావడంతో కుట్రకు తెరలేపారని నిర్ధారణ**
**ఇప్పటికే తిరుగుబాటు కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న యూన్**
**ఈ తీర్పును సవాల్ చేస్తామని న్యాయవాదుల ప్రకటన**



దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు న్యాయస్థానంలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగాంగ్‌పైకి సైనిక డ్రోన్లను పంపిన కేసులో సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆయనకు శుక్రవారం 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. దేశంలో విధించిన మార్షల్ లా (సైనిక పాలన) విఫలం కావడంతో ఓ సాకును సృష్టించే ఉద్దేశంలో భాగంగా యూన్ ఈ డ్రోన్ల దాడికి ఆదేశించారని కోర్టు నిర్ధారించింది. 2024 అక్టోబర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో యూన్ పాత్ర స్పష్టంగా ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. శత్రువులకు సహకరించడం, అధికార దుర్వినియోగం వంటి అభియోగాల కింద ఆయనను దోషిగా తేల్చింది. ఈ కేసులో యూన్‌తో పాటు మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్-హ్యూన్‌కు కూడా 30 ఏళ్ల శిక్ష పడగా, మరికొందరు సైనికాధికారులకు స్వల్పకాలిక శిక్షలను కోర్టు ఖరారు చేసింది.

కాగా, 2024 చివర్లో మార్షల్ లా విధించి తిరుగుబాటుకు యత్నించిన కేసులో యూన్ సుక్ యోల్ ఇప్పటికే యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. నాడు ఆయన మార్షల్ లా విధించారు. కానీ ప్రజాప్రతినిధులు సహా అందరి నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలో దానిని విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు. ఉత్తర కొరియాను రెచ్చగొట్టి, ఆ దేశం నుంచి ప్రతిస్పందన రాబట్టేందుకే 10కి పైగా డ్రోన్లను పంపారని ప్రాసిక్యూటర్లు వాదించారు. తద్వారా ఉద్రిక్తతలు సృష్టించి, రాజకీయ ప్రత్యర్థులను దేశ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించి మార్షల్ లా విధించే పన్నాగం పన్నారని ఆరోపించారు. అయితే, యూన్ తరపు న్యాయవాదులు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. ఉత్తర కొరియా ప్రయోగించిన చెత్త బెలూన్ల వంటి కవ్వింపు చర్యలకు ప్రతిస్పందనగానే డ్రోన్లను పంపామని, ఈ తీర్పుపై అప్పీల్ చేస్తామని వారు పేర్కొన్నారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో ఈ కేసు విచారణ చాలావరకు రహస్యంగా సాగింది.

# బంజారాహిల్స్‌లో దౌర్జన్యం.. ట్రాఫిక్ పోలీసుపై చేయి చేసుకున్న అధికారులు!

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో విధి నిర్వహణలో ఉన్న ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఇద్దరు జీహెచ్ఎంసీ అధికారులు దాడికి పాల్పడటం తీవ్ర సంచలనం సృష్టించింది. నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వాహనాన్ని అడ్డుకోవడంతో, వారు తనపై భౌతిక దాడికి దిగారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ 11, గురువారం నాడు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లూసిడ్ బైలేన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇ. శ్రీశైలం విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ రహదారిపై నాలుగు చక్రాల వాహనాల ప్రవేశం నిషిద్ధం. అయితే, ఆ సమయంలో అటుగా వచ్చిన ఒక గ్రీన్ కలర్ క్రెటా కారును శ్రీశైలం నిలిపివేశారు. దీంతో కారులో ఉన్న జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ సహాయకుడు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కారు డ్రైవర్ తనను దుర్భాషలాడటమే కాకుండా, ఉద్యోగం నుంచి తొలగిస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు శ్రీశైలం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా, తనపై చేయి చేసుకుని కాలితో తన్నారని ఆరోపించారు. అనంతరం వారు బారికేడ్లను తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనను శ్రీశైలం తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించగా, సదరు వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం, దాడి చేయడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం మరియు బెదిరింపులకు పాల్పడటం వంటి అభియోగాలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# ప్రభుత్వ బడి విద్యార్థులకు బంపర్ గిఫ్ట్..
# ఈ ఏడాది నుంచి భారీ మార్పులు!

వచ్చే సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బడులు ప్రారంభం కానున్నాయి. దీంతో జూన్ 15 నుంచి 2026-27 విద్యా సంవత్సరం మొదలవనుంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపడుతోంది.. పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. జూన్ 15న రాష్ట్రంలోని పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే విద్యాశాఖ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గత ఏడాదితో పోలిస్తే కనీసం 10 శాతం మేర అడ్మిషన్లు పెంచాలని ఉపాధ్యాయులకు లక్ష్యాలను నిర్దేశించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌బుక్స్ అందించనున్నారు. అలాగే రాష్ట్రంలోని 9 వేల ప్రభుత్వ పాఠశాలలకు ఆగస్టు నాటికి హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు.. ప్రతిరోజూ అల్పాహారం, వారానికి మూడు రోజుల పాటు నాణ్యమైన పాలను కూడా అందించనున్నారు. పాఠశాలలు ప్రారంభమైన రోజునే యూనిఫాంలు, బూట్లు, బెల్టులు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వాటి పంపిణీలో స్వల్ప ఆలస్యం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించనున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఇప్పటికే పాఠశాలలకు చేరవేసినట్లు అధికారులు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 20 వేల మేర తగ్గింది. 2024-25లో 16.78 లక్షల మంది విద్యార్థులు ఉండగా, 2025-26 నాటికి ఆ సంఖ్య 16.58 లక్షలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో కనీసం 10 శాతం మేర చేరికలు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే దాదాపు 1.65 లక్షల మంది కొత్త విద్యార్థులు చేరితేనే లక్ష్యం



నెరవేరుతుంది. ఈసారి రాష్ట్రంలోని 2,769 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నందున 30 వేల నుంచి 40 వేల మంది చిన్నారులు కొత్తగా చేరే అవకాశం ఉందని అంచనా. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలనే సర్కార్ తాపత్రయం కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అధికమవుతున్నాయి. సమగ్ర శిక్ష, హెచ్‌సీయూ, యునిసెఫ్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో 25 శాతం మంది ఉపాధ్యాయులు బోధనకు సగం లేదా అంతకంటే తక్కువ సమయం మాత్రమే కేటాయించగలుగుతున్నట్లు వెల్లడైంది. దసరా సెలవుల నాటికి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేసి, ఆ తర్వాత పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతున్నప్పటికీ విద్యార్థుల చేరికలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఉపాధ్యాయుల కొరత పలు బడుల్లో కొనసాగుతుంది. రాష్ట్రంలో సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో కేవలం 16 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. మరోవైపు కేవలం 12 వేల ప్రైవేటు పాఠశాలల్లోనే 35 లక్షలకుపైగా విద్యార్థులు చదవడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం నెలకు సగటున రూ.9 వేల వరకు, ఏడాదికి రూ.లక్షకు పైగా ఖర్చు చేస్తున్న ఫలితాలు అరకొరగా ఉంటున్నాయి. ఎన్ని సంక్షేమ చర్యలు చేపట్టిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ బడుల పట్ల నమ్మకం పెరగడం లేదు.


## ప్రభుత్వ కీలక నిర్ణయం..ఇకపై అన్ని శనివారాలు సెలవు




ప్రభుత్వ ఉద్యోగుల పని ఒత్తిడిని తగ్గించి, వారి 'వర్క్ లైఫ్ బ్యాలెన్స్' పెంపొందించే దిశగా త్రిపుర ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఇకపై నెలలోని అన్ని శనివారాలను అధికారికంగా సెలవు దినాలుగా ప్రకటిస్తూ అక్కడి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు త్రిపురలో సాధారణంగా అన్ని రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే నెలలో కేవలం రెండవ, నాల్గవ శనివారాలు మాత్రమే ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉండేది. కానీ తాజా నిర్ణయంతో, ఇకపై నెలలో వచ్చే అన్ని ఆదివారాలతో పాటు అన్ని శనివారాలు కూడా ఉద్యోగులకు పూర్తి సెలవు దినాలుగా మారనున్నాయి. అంటే వారానికి ఐదు రోజులు మాత్రమే ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తాయి. వారంలో ఒక రోజు పనిదినం తగ్గుతున్న నేపథ్యంలో, ప్రజా సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు వీలుగా త్రిపుర సర్కార్ ఆఫీసు పని సమయాల్లో కీలక మార్పులు చేసింది. అయితే రోజువారీ పని గంటలను ప్రభుత్వం పెంచింది. ఇదివరకు ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఉన్న పని సమయాన్ని.. ఇకపై ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు పొడిగించారు. త్రిపుర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై అక్కడి ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే తరహా ఐదు రోజుల పని వారాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అమలు చేస్తే ఉద్యోగుల ఉత్పాదకత మరింత పెరుగుతుందని ఇతర రాష్ట్రాల ఉద్యోగులు కూడా అభిప్రాయపడుతున్నారు. కొత్త విధానం ఉద్యోగులకు కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపే అవకాశాన్ని ఇస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. వ్యక్తిగత అభివృద్ధి, విశ్రాంతి, మానసిక ఆరోగ్యానికి సహాయపడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వారాంతంలో వరుసగా రెండు రోజులు విశ్రాంతి తీసుకునే అవకాశం పొందడం వల్ల ఉద్యోగ సంతృప్తి పెరుగుతుందని తో పాటు కార్యాలయాల్లో ఉత్పాదకత కూడా మెరుగుపడే అవకాశముందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి మాణిక్ సాహా ప్రభుత్వం చేపడుతున్న పరిపాలనా సంస్కరణల్లో ఇది మరో కీలక అడుగుగా భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వస్తున్న సానుకూల స్పందనను దృష్టిలో ఉంచుకుంటే, ఈ కొత్త పని విధానం భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు..
# నావికుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం హై అలర్ట్..

పశ్చిమాసియా (గల్ఫ్) ప్రాంతంలో మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, సముద్ర భద్రతా సవాళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత అప్రమత్తమైంది. ఆయా ప్రాంతాల గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల ప్రాణాలను, అలాగే.. భారత ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం హై-అలర్ట్ ప్రకటించింది. పశ్చిమాసియా (గల్ఫ్) ప్రాంతంలో మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, సముద్ర భద్రతా సవాళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆయా ప్రాంతాల గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల ప్రాణాలను, భారతదేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం హై-అలర్ట్ ప్రకటించింది. ప్రతిస్పందన యంత్రాంగాలను పర్యవేక్షించడంతోపాటు.. సమన్వయం చేయడం కోసం అనునిత్యం పనిచేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ (ఎంఓపీఎస్‌డబ్ల్యూ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) ద్వారా.. హోర్ముజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్, వాటికి ఆనుకుని ఉన్న సముద్ర ప్రాంతాలలో, వాటి పరిసరాల్లోని పరిణామాలపై నిరంతర పర్యవేక్షణను కొనసాగిస్తోందని తెలిపింది. తీవ్రమైన భౌగోళిక రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో, భారతీయ నావికులకు, వారి కుటుంబాలకు భారత ప్రభుత్వం దృఢంగా అండగా నిలుస్తుందని , వారి సంక్షేమం, భద్రత, శ్రేయస్సును నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలను కొనసాగిస్తుందని పునరుద్ఘాటిస్తోంది.. అని ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ తెలిపింది. పత్రికా ప్రకటన ప్రకారం.. "భారత నావికులకు సకాలంలో మద్దతు, సహాయం అందేలా చూసేందుకు ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత నౌకాదళం, విదేశాల్లోని భారత మిషన్లు, మిత్ర దేశాల సముద్ర పరిపాలన సంస్థలు, షిప్పింగ్ కంపెనీలు, నావికుల సంక్షేమ సంస్థలు, ఇతర సంబంధిత భాగస్వాములతో సన్నిహితంగా సమన్వయం చేసుకుంటోంది." ఈ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య నౌకలకు సంబంధించి ఇటీవల జరిగిన భద్రతా సంఘటనలు, వాణిజ్య నౌకాయానం ఎదుర్కొంటున్న పెరుగుతున్న ప్రమాదాలను వెలుగులోకి తెచ్చాయి. ప్రపంచ వాణిజ్యానికి, ఇంధన భద్రతకు ఈ అంతర్జాతీయ నౌకాయాన మార్గాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి, భారతీయ నావికులు లేదా భారతీయ సముద్ర ప్రయోజనాలకు సంబంధించిన ఏ ఆకస్మిక పరిస్థితికైనా స్పందించేందుకు సిద్ధంగా, అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సంబంధిత ఏజెన్సీలన్నిటినీ ఆదేశించింది" అని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ (ఎంఓపీఎస్‌డబ్ల్యూ) శాఖ ప్రకటనలో తెలిపింది. సంఘర్షణ ప్రభావిత జలాల గుండా ప్రయాణించే భారతీయ, విదేశీ జెండాలు గల నౌకలలో పనిచేస్తున్న భారతీయ నావికులందరూ అత్యంత జాగ్రత్త, అప్రమత్తతతో ఉండాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ సూచించింది. నౌకా నిర్వాహకులు, షిప్పింగ్ కంపెనీలు కూడా ప్రస్తుత సముద్ర భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని, పరిస్థితులపై మెరుగైన అవగాహనను కొనసాగించాలని, అలాగే భారత ప్రభుత్వం, సంబంధిత అంతర్జాతీయ అధికార సంస్థలు జారీ చేసిన సలహాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించింది. భారతీయ నావికులకు సంబంధించిన ఏ సంఘటననైనా తక్షణ జోక్యం, సమన్వయం కోసం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌కు వెంటనే నివేదించాలని






సంబంధిత వర్గాలను ఆదేశించడం జరిగింది. భారతీయ నావికులకు, వారి కుటుంబాలకు సహాయం అందించడానికి ప్రత్యేక సమాచార మార్గాలు, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలు ఇరవై నాలుగు గంటలూ పనిచేస్తూనే ఉంటాయని పేర్కొంది. కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి (ఎంఓపీఎస్‌డబ్ల్యూ) సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ.. "గల్ఫ్ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోంది, ప్రతి భారతీయ నావికుడి భద్రత, రక్షణ, సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉంది. అవసరమైనప్పుడు సకాలంలో మద్దతు, సహాయం అందించడానికి అన్ని సంబంధిత మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీలు, విదేశాల్లోని మిషన్లు సన్నిహిత సమన్వయంతో పనిచేస్తున్నాయి." అని తెలిపారు.

ఈ ప్రాంతంలో ఇటీవల నివేదించబడిన సంఘటనలలో, 24 మంది భారతీయ నావికులతో సహ 28 మంది సిబ్బందిని తీసుకువెళ్తున్న పలావు జెండా కలిగిన మధ్య శ్రేణి ట్యాంకర్ మీ సెట్టెబెల్లో (ఐఎంఓ 9162916), ఒమన్‌లోని సోహార్‌కు ఈశాన్యంగా సుమారు 20 నాటికల్ మైళ్ల దూరంలో ప్రయాణిస్తుండగా, 10 జూన్ 2026న క్షిపణి దాడికి గురైంది. ఒమన్ సముద్ర భద్రతా కేంద్రం నుండి అందిన సమాచారం, నౌక యాజమాన్యం నుండి వచ్చిన తదుపరి నివేదికల ప్రకారం, ఈ దాడిలో ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందిన వెంటనే, భారత ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించడానికి సంబంధిత అధికారులు, ఓడ యజమానులు, ఆర్‌పీఎస్ఎల్‌తో చురుకుగా సమన్వయం చేసుకుంది. గల్లంతైన ముగ్గురు భారతీయ నావికుల మృతదేహాలను త్వరితగతిన గుర్తించి, నిర్ధారించారు, మిగిలిన సిబ్బంది అందరినీ సురక్షితంగా రక్షించారు. రక్షించబడిన నావికులను స్వదేశానికి రప్పించి, వారి పార్థివ దేహాలను వీలైనంత త్వరగా గౌరవప్రదంగా వారి కుటుంబాలకు అప్పగించేందుకు ఇప్పుడు ప్రయత్నాలు వేగవంతం చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు భారత ప్రభుత్వం ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది. సముద్రంలో తమ విధులను నిర్వర్తిస్తుండగా భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడం దేశానికి తీరని విషాదం. ఈ విషాద సంఘటనపై కేంద్ర ఓడరేవులు, నౌకా రవాణా, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ స్పందిస్తూ, "పలావు జెండా కలిగిన మీ సెట్టెబెల్లో నౌకలో జరిగిన ఈ ఘోర సంఘటన గురించి తెలుసుకోవడం చాలా దురదృష్టకరం. విచారకరంగా, మొదట గల్లంతయ్యారని భావించిన ముగ్గురు భారతీయ నావికుల మృతదేహాలను గుర్తించి, నిర్ధారించిన తర్వాత వారు మరణించినట్లు ధృవీకరించబడింది. భారత పౌరుల భద్రత, భారత సముద్ర ప్రయోజనాల పరిరక్షణ, చట్టబద్ధమైన సరుకుల రవాణాకు అంతరాయం కలగకపోవడం మా అత్యంత ప్రాధాన్యతలుగా ఉంటాయి. భారత ప్రభుత్వం పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. భారతీయ నావికుల ప్రాణాలను కాపాడటానికి , దేశ ప్రయోజనాలను పరిరక్షించడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుంది" అని అన్నారు. భారతీయ నావికుల సంక్షేమం, భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగినవని ప్రభుత్వం మరోసారి పునరుద్ఘాటించింది . డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సీఫేరర్స్ వెల్ఫేర్ ఫండ్ సొసైటీ (ఎస్‌డబ్ల్యూఎఫ్ఎస్), ప్రభావిత నావికులకు, వారి కుటుంబాలకు అవసరమైనప్పుడు అర్హులైన సంక్షేమ ప్రయోజనాలు, ఆర్థిక సహాయం, ఇతర సహాయక చర్యలను అందించడానికి సిద్ధంగా ఉంది. నియమావళి ప్రకారం, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ. 10 లక్షలను విడుదల చేస్తోంది. ఇంకా సోనోవాల్ మాట్లాడుతూ, "ఇది మన సముద్రయాన కుటుంబానికి తీరని లోటు. ఈ క్లిష్ట సమయంలో మోదీ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తుంది.. వారి కుటుంబ సభ్యులకు పూర్తి మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉంది. రక్షించబడిన సిబ్బంది మృతదేహాలను వెంటనే స్వదేశానికి రప్పించాలని, మృతుల పార్థివ దేహాలకు అంత్యక్రియల కోసం త్వరితగతిన తరలించాలని నేను అధికారులను ఆదేశించాను." అని అన్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్, సంబంధిత రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్స్ (ఆర్‌పీఎస్ఎల్) ఏజెన్సీలతో కలిసి, ప్రభావిత నావికుల కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. రక్షించబడిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి, మృతదేహాలను తరలించడానికి, సంబంధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించడానికి ప్రభుత్వం సంబంధిత అధికారులతో చురుకుగా సమన్వయం చేస్తోందన్నారు.

ఏదైనా అత్యవసర సహాయం కోసం, పౌరులు డీజీఎస్ (డీజీ కమ్యూనికేషన్ సెంటర్)ను dgcomm-dgs@gov.in అనే ఈమెయిల్ ద్వారా లేదా +91 8657549760 నంబర్‌కు వాట్సాప్/కాల్ ద్వారా సంప్రదించవచ్చు. సంప్రదించడానికి ప్రత్యామ్నాయ నంబర్లు: +91 2222613606, +91 865754 9752) లేదా 24x7 ఫిర్యాదుల పరిష్కార మార్గాలైన టోల్-ఫ్రీ నంబర్ (దేశీయ): 1800-889-7768, అంతర్జాతీయ టోల్-ఫ్రీ: +1-888-988-0256, వాట్సాప్: +91 8655856830, కు ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చు

## ఒమన్ తీరంలో భారతీయుల మృతిపై ఇరాన్ సంతాపం.. అమెరికా చర్యలపై ఫైర్..!




ఒమన్ తీరంలో జరిగిన వాణిజ్య నౌక ఘటనలో భారతీయ నావికులు మృతి చెందిన నేపథ్యంలో ఇరాన్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై స్పందించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి, పబ్లిక్ డిప్లొమసీ సెంటర్ అధిపతి ఇస్మాయిల్ బఘాయ్ భారత ప్రజలకు, కేంద్ర ప్రభుత్వానికి, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ప్రకటనలో భారతీయ నావికుల మృతిపై ఇరాన్ సానుభూతి వ్యక్తం చేశారు.ఒమన్ తీరంలో జరిగిన వాణిజ్య నౌక ఘటనలో భారతీయ నావికులు మృతి చెందిన నేపథ్యంలో ఇరాన్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై స్పందించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి, పబ్లిక్ డిప్లొమసీ సెంటర్ అధిపతి ఇస్మాయిల్ బఘాయ్ భారత ప్రజలకు, కేంద్ర ప్రభుత్వానికి, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ప్రకటనలో భారతీయ నావికుల మృతిపై ఇరాన్ సానుభూతి వ్యక్తం చేశారు.అదే సమయంలో ఈ ఘటనకు సంబంధించి అమెరికాపై ఇరాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఒమన్ తీరంలో దాడికి గురైన నౌక ఘటన అమెరికా కొనసాగిస్తున్న సాయుధ దోపిడీ, సముద్రపు దొంగతనం విధానాలకు నిదర్శనమని ఇస్మాయిల్ బఘాయ్ విమర్శించారు. ఇటువంటి చర్యలు అంతర్జాతీయ చట్టాలకు, సముద్ర భద్రతా సూత్రాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అమెరికా చేపడుతున్న చర్యలు ప్రపంచ శాంతి, భద్రతకు ముప్పుగా మారుతున్నాయని, అంతర్జాతీయ సమాజం ఈ అంశంపై స్పందించి అమెరికాను జవాబుదారీగా నిలబెట్టాలని కోరారు. ఇదిలావుంటే, ఈ ఘటన సమయంలో నౌకలో మొత్తం 24 మంది భారతీయ సిబ్బంది ఉన్నట్లు సమాచారం. వీరిలో 21 మందిని సురక్షితంగా రక్షించగా, ముగ్గురు గల్లంతయ్యారు. అనంతరం గల్లంతైన వారిలో ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. అయితే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చీఫ్ ఇంజనీర్ పటాసాల సురేష్ ఇప్పటికీ కనిపించకపోవడంతో ఆందోళన నెలకొంది. ఆయన కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నప్పటికీ, సజీవంగా లభించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. ఈ ఘటనపై భారత ప్రభుత్వం కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఘటనను ఖండిస్తూ, న్యూఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్తకు అధికారికంగా నిరసన తెలిపింది. భారతీయ నావికుల భద్రతకు సంబంధించిన అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒమన్ తీరంలో చోటుచేసుకున్న ఈ ఘటన అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారగా, దీనిపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# సరిహద్దులో కొత్త ఉద్రిక్తత.. భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ జమాతే ఇస్లామ్ వీధి



భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు అంశం మరోసారి ఉద్రిక్తతలకు దారితీస్తోంది. భారతదేశం బలవంతంగా బంగ్లాదేశ్ పౌరులను సరిహద్దు దాటించి తమ దేశంలోకి పంపిస్తోందని ఆరోపిస్తూ, బంగ్లాదేశ్ జమాతే-ఈ-ఇస్లామ్ నేతృత్వంలోని 11 పార్టీల కూటమి సరిహద్దు ప్రాంతాల్లో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. శుక్రవారం (జూన్ 12) సరిహద్దు జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించనున్న ఈ కూటమి, జూన్ 15న రాజధాని ఢాకాలో భారీ నిరసన సభ, ఊరేగింపు చేపట్టనున్నట్లు ప్రకటించింది.భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు అంశం మరోసారి ఉద్రిక్తతలకు దారితీస్తోంది. భారతదేశం బలవంతంగా బంగ్లాదేశ్ పౌరులను సరిహద్దు దాటించి తమ దేశంలోకి పంపిస్తోందని ఆరోపిస్తూ, బంగ్లాదేశ్ జమాతే-ఈ-ఇస్లామ్ నేతృత్వంలోని 11 పార్టీల కూటమి సరిహద్దు ప్రాంతాల్లో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ కూటమి, జూన్ 15న రాజధాని ఢాకాలో భారీ నిరసన సభ, ఊరేగింపు చేపట్టనున్నట్లు ప్రకటించింది.జమాత్ నేతలు భారత్ అక్రమంగా బంగ్లాదేశ్ పౌరులను తిరిగి పంపిస్తోందని, అలాగే బీఎస్ఎఫ్ కాల్పుల్లో బంగ్లాదేశ్ పౌరులు మరణిస్తున్నారని ఆరోపించారు. గత మూడు నెలల్లో సరిహద్దు వెంబడి 50కిపైగా "పుష్-ఇన్" ఘటనలు జరిగాయని, సుమారు 2,479 మందిని బంగ్లాదేశ్‌లోకి పంపేందుకు ప్రయత్నించారని జమాత్ నాయకుడు ఏహెచ్ఎం హమీదుర్ రెహమాన్ ఆజాద్ పేర్కొన్నారు. ఇదే సమయంలో హసీనా వ్యతిరేక ఉద్యమం నుంచి ఎదిగిన ఎన్‌సీపీ కూడా ఈ నిరసనలకు మద్దతు ప్రకటించింది. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలు మానవ కవచంగా ఏర్పడి అక్రమ ప్రవేశాలు, బలవంతపు తరలింపులను అడ్డుకోవాలని ఎన్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు.అయితే ఈ ఆరోపణలను భారత్ పూర్తిగా ఖండిస్తోంది. అక్రమంగా భారత్‌లో నివసిస్తున్న విదేశీ పౌరులను మాత్రమే చట్టబద్ధమైన విధానాలు, ద్వైపాక్షిక ఒప్పందాల ప్రకారం స్వదేశానికి పంపుతున్నామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సరైన గుర్తింపు, ధృవీకరణ అనంతరమే చర్యలు చేపడుతున్నామని తెలిపింది.ఇటీవల న్యూఢిల్లీలో బీజీబీ, బీఎస్ఎఫ్‌ల మధ్య జరిగిన డైరెక్టర్ జనరల్ స్థాయి సమావేశాల్లో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. సుమారు 4,096 కిలోమీటర్ల పొడవైన భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు నేపథ్యంలో ఈ వివాదం ఇరు దేశాల మధ్య కీలక అంశంగా మారింది. దౌత్యస్థాయిలో చర్చలు కొనసాగుతున్నప్పటికీ, జమాత్ నేతృత్వంలోని కూటమి వీధి పోరాటానికి సిద్ధమవుతుండటంతో ఈ అంశం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎల్ఐసీపై ఓ తల్లి 12 ఏళ్ల సుదీర్ఘ పోరాటం.. రూ. 1.26 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశం!




భారతీయ జీవిత బీమా సంస్థ (గా×జ) క్లెయిమ్ తిరస్కరణపై ముంబైకి చెందిన ఒక తల్లి జరిపిన అలుపెరుగని పోరాటం ఎట్టకేలకు ఫలించింది. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (చీజణ=జ) ఎల్ఐసీ సంస్థకు గట్టి షాక్ ఇస్తూ, బాధిత తల్లికి వడ్డీతో కలిపి రూ. 1.26 కోట్లు చెల్లించాలని సంచలన తీర్పునిచ్చింది. 12 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ న్యాయపోరాటం దేశవ్యాప్తంగా ఉన్న ఇన్సూరెన్స్ వినియోగదారులలో కొత్త భరోసాను నింపింది.ముంబైకి చెందిన జయశ్రీ సురేష్ గంభీర్ అనే వృద్ధురాలు తన దివంగత కుమారుడి బీమా క్లెయిమ్ కోసం ఎల్ఐసీ (గా×జ) సంస్థపై 12 ఏళ్ల పాటు జరిపిన సుదీర్ఘ న్యాయపోరాటంలో విజయం సాధించారు. ముంబైకి చెందిన నితిన్ సురేష్ గంభీర్ (38) అనే వ్యక్తి జూన్ 2010లో ఎల్ఐసీలో మొత్తం రూ. 60 లక్షల విలువైన ఐదు జీవిత బీమా పాలసీలను తీసుకున్నాడు. వీటికి తన తల్లి జయశ్రీ సురేష్ గంభీర్‌ను నామినీగా పెట్టాడు. దురదృష్టవశాత్తూ, పాలసీలు తీసుకున్న మూడేళ్లకు, అంటే జూన్ 11, 2013న నితిన్ హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు. కుమారుడి మరణం తర్వాత తల్లి జయశ్రీ క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోగా, జూలై 2014లో ఎల్ఐసీ ఆ ఐదు క్లెయిమ్‌లను తిరస్కరించింది. నితిన్‌కు ముందే డయాబెటిస్ (చక్కెర వ్యాధి) ఉందని, పాలసీ ఫారమ్‌లో ఆ విషయాన్ని దాచారని ఎల్ఐసీ పేర్కొంది.

తల్లి అలుపెరుగని పోరాటం:

ఎల్ఐసీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ జయశ్రీ మొదట మహారాష్ట్ర స్టేట్ కన్స్యూమర్ కమిషన్‌ను ఆశ్రయించారు. అక్కడ పాక్షిక ఉపశమనం లభించినప్పటికీ, పూర్తి న్యాయం కోసం ఆమె ఎన్‌సిడిఆర్‌సి (చీజణ=జ) మెట్లు ఎక్కారు. ఈ కేసును విచారించిన కమిషన్ సభ్యులు డాక్టర్ ఇందర్ జిత్ సింగ్, శశి నందకియోల్యార్‌తో కూడిన బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. మృతుడు నితిన్ ఎలాంటి ఆరోగ్య విషయాలను దాచలేదని, ఎల్ఐసీ క్లెయిమ్‌ను తిరస్కరించడం ఎంతమాత్రం సమంజసం కాదని స్పష్టం చేసింది. పైగా, డయాబెటిస్‌కు, అతను మరణించిన కారణమైన గుండెపోటుకు ఎలాంటి సంబంధం ఉన్నట్లు ఆధారాలు లేవని కోర్టు తేల్చిచెప్పింది.

భారీ పెనాల్టీతో కోర్టు తీర్పు:


ఎల్ఐసీ వాదనలను పూర్తిగా తోసిపుచ్చిన కోర్టు, 2014 నుండి ఇప్పటివరకు (12 ఏళ్లు) ఏడాదికి 9 శాతం చొప్పున సాధారణ వడ్డీని లెక్కించి ఇవ్వాలని ఆదేశించింది. దీని ప్రకారం కేవలం వడ్డీయే రూ. 64.8 లక్షలు దాటింది. అసలు మొత్తం రూ. 60 లక్షలు, మానసిక వేదనకు రూ. 1 లక్ష, కోర్టు ఖర్చుల కింద రూ. 50 వేలు కలిపి మొత్తం రూ. 1,26,30,000 (రూ. 1.26 కోట్లు) నామినీ అయిన తల్లికి తక్షణమే చెల్లించాలని ఎల్ఐసీని ఆదేశించింది.పాలసీదారులు మరణించినప్పుడు సాంకేతిక కారణాలు చెప్తూ క్లెయిమ్‌లను తిరస్కరించే పెద్ద పెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలకు ఈ తీర్పు ఒక గుణపాఠం. ఒంటరి మహిళ అయినా సరే, ధైర్యంతో పోరాడి తన కుమారుడి హక్కును సాధించుకున్న ఈ తల్లి కథ ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకుంటోంది.

# ఫ్యాన్సీ నెంబర్ ప్రియులకు గుడ్ న్యూస్.. ఇక 30 కాదు 60 రోజులు




కొత్త వాహనాలకు ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్ తీసుకోవాలనుకునే వారికి తెలంగాణ రవాణా శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. ఫ్యాన్సీ నంబర్ ఎంపిక కోసం ఇప్పటివరకు ఉన్న 30 రోజుల గడువును 60 రోజులకు పెంచింది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ పొందిన తేదీ నుంచి రెండు నెలలలోపు వాహన యజమానులు తమకు నచ్చిన నంబర్‌ను బుక్ చేసుకోవచ్చు.కొత్త వాహనం కొనుగోలు చేసిన తర్వాత ప్రత్యేకమైన లేదా తమకు నచ్చిన రిజిస్ట్రేషన్ నంబర్ (ఫ్యాన్సీ నంబర్) తీసుకోవాలనుకునే వారికి తెలంగాణ రవాణా శాఖ శుభవార్త చెప్పింది. ఇప్పటివరకు ఫ్యాన్సీ నంబర్‌ను ఎంపిక చేసుకునేందుకు ఉన్న 30 రోజుల గడువును 60 రోజులకు పెంచింది. దీంతో వాహన యజమానులకు తమకు నచ్చిన నంబర్‌ను ఎంపిక చేసుకునేందుకు మరింత సమయం లభించనుంది.సాధారణంగా కొత్త వాహనం కొనుగోలు చేసినప్పుడు ముందుగా తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) ఇస్తారు. గతంలో ఈ టీఆర్ గడువు 30 రోజులు మాత్రమే ఉండేది. ఆ సమయంలోనే ఫ్యాన్సీ నంబర్ కోసం దరఖాస్తు చేసి, నంబర్‌ను ఖరారు చేయాల్సి వచ్చేది. అయితే చాలామంది వాహన యజమానులు తమకు కావాల్సిన నంబర్ అందుబాటులో ఉందో లేదో చూసుకోవడం, వేలం ప్రక్రియలో పాల్గొనడం లేదా ఇతర కారణాల వల్ల గడువులోపు ప్రక్రియ పూర్తి చేయలేకపోతున్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని రవాణా శాఖ గడువును రెండు నెలలకు పెంచింది.వాహనం కొనుగోలు చేసే సమయంలో ఫ్యాన్సీ నంబర్ కావాలని ఎంపిక చేసుకున్నప్పటికీ, ఇప్పటివరకు ఏ నంబర్‌ను ఖరారు చేయని వారు వీలైనంత త్వరగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, తాత్కాలిక రిజిస్ట్రేషన్ పొందిన తేదీ నుంచి రెండు నెలల లోపు ఫ్యాన్సీ నంబర్‌ను బుక్ చేసుకోకపోతే, ఆ వాహనానికి శాఖ తరఫున సాధారణ రిజిస్ట్రేషన్ నంబర్‌ను కేటాయిస్తారు. అంటే వాహన యజమాని ఎలాంటి ప్రత్యేక నంబర్‌ను ఎంపిక చేయకపోతే, అందుబాటులో ఉన్న సాధారణ సీరియల్ నంబర్‌ను వాహనానికి కేటాయిస్తారు.ఒకసారి సాధారణ రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించిన తర్వాత తిరిగి ఫ్యాన్సీ నంబర్ కోసం దరఖాస్తు చేసే అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. అందువల్ల ప్రత్యేక నంబర్ కావాలనుకునే వాహన యజమానులు నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రవాణా శాఖ సూచించింది.

## పెళ్లై 15 ఏళ్లు.. ఇద్దరు పిల్లలు.. పాత లవర్ కోసం ఎంతకు తెగించావ్ ప్రియాంక.. చివరకు




కర్ణాటకలో సంచలనం రేపిన చిన్నారి వెన్నెల హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రియుడితో కలిసి జీవించేందుకు అడ్డుగా ఉందనే కారణంతో ఐదేళ్ల కుమార్తెను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తల్లి ప్రియాంకను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రియాంక ప్రియుడు మోహన్ ఇప్పటికే పోలీసుల అదుపులో ఉండగా, దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యం బయటపడటంతో ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. పెళ్లై 15 ఏళ్లు.. ఇద్దరు పిల్లలు.. పాత లవర్ కోసం ఎంతకు తెగించావ్ ప్రియాంక.. చివరకు

15 సంవత్సరాల క్రితం పెళ్లైంది.. ఇద్దరు పిల్లలు.. అన్యోన్య దాంపాత్యం.. భర్తకు మంచి ఉద్యోగం.. ఆమె ఇంట్లోనే ఉండి పిల్లను చూసుకునేది.. కట్ చేస్తే.. ఇంతలోనే భార్యకు పాఠశాలలో చదువుకున్న పాత స్నేహితుడు పరిచయమయ్యాడు. ఈ క్రమంలోనే ఇద్దరూ మాట్లాడుకున్నారు.. తాను రియల్ ఎస్టేట్ వ్యాపారినని.. కోట్ల రూపాయలు సంపాదించానని చెప్పడంతో.. ఆమె అతనికి దగ్గరైంది.. ఆ తర్వాత ఒకరినొకరు ఇష్టపడ్డారు.. పాత ప్రేమ సరికొత్తగా చిగురించింది.. సాన్నిహిత్య సంబంధం కొనసాగించింది. భర్త వద్దన్నా వినలేదు.. విడాకులు కావాలని నోటీసులు పంపింది.. భర్తను వదిలిపెట్టి.. ప్రియుడితో రిలేషన్ కొనసాగించింది.. చివరకు ప్రియుడితో కలిసి జీవించేందుకు కన్న కూతురిని చంపింది.. ఈ దారుణ ఘటన కర్ణాటకలో కలకలం రేపింది.. ప్రియుడితో కలిసి జీవించేందుకు అడ్డుగా ఉందని తన కుమార్తె వెన్నెల (5)ను హత్య చేసిన తల్లి ప్రియాంకను కాడుగోడి పోలీసులు గురువారం హాసనలో అరెస్టు చేశారు.. అంతకుముందు ప్రియుడును పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగుచూశాయి..

అసలేం జరిగిందంటే..

దావణగెరెకు చెందిన ప్రవీణ్- ప్రియాంకకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. ప్రవీణ్ ఒక ప్రైవేటు కంపెనీ ఉద్యోగిగా ఉండగా.. ప్రియాంక న్యాయవాదిగా పనిచేస్తున్నారు. వీరికి 11 ఏళ్ల కుమారుడు, 5ఏళ్ల కుమార్తె ఉన్నారు. కాడుగోడిలో ఉంటున్న సమయంలో తనతో కలిసి పాఠశాలలో చదువుకున్న మోహన్ పరిచయమై.. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పనిచేస్తున్నానని.. కోట్ల డబ్బులు ఉన్నాయని చెప్పాడు. అయితే.. అదంతా అబద్ధమని.. అతను అద్దె ఇంట్లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రియాంక, మోహన్ సాన్నిహిత్యం గురించి తెలిసి.. భర్త ప్రవీణ్ ముందే హెచ్చరించాడని పోలీసులు వివరించారు. దీంతో ప్రియాంక కుమార్తెను తీసుకుని ఇల్లు వదిలి వెళ్లి.. మోహన్‌తో సహజీవితాన్ని ప్రారంభించి.. భర్తకు విడాకుల నోటీసులు కూడా పంపించింది. ఈ క్రమంలోనే.. వెన్నెల అనారోగ్యం పాలై మరణించిందని భర్తకు, తన సోదరునికి చెప్పింది. అంత్యక్రియలు పూర్తయ్యాయని, పోస్టుమార్టం నివేదికను భర్తకు పంపింది. అయితే.. దానిని ప్రవీణ్ విదేశాల్లో ఉన్న ఒక వైద్యునికి పంపగా.. నివేదిక సరిగా లేదని చెప్పడంతో అతను పోలీసులను ఆశ్రయించాడు..

వివాదంలో పోలీసులు.. ప్రియాంకకు సహకరించారా..?

బెంగళూరు నగరంలోని కడుగోడి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బాలిక హత్య కేసు ఇప్పుడు పెద్ద వివాదానికి కారణమైంది. తల్లి, ఆమె ప్రియుడు కలిసి చిన్నారిని హత్య చేసిన ఈ కేసుకు సంబంధించి ముగ్గురు పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసుల వైఫల్యం ఉన్నట్లు తేలడంతో, ఆ ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. వాస్తవానికి వెన్నెల అనే చిన్నారి మార్చి నెలలో మరణించింది. ఆ సమయంలో, ఈ కేసును అసహజ మరణ నివేదిక (ఖణ=)గా నమోదు చేశారు. అంటే, మరణం చుట్టూ అనుమానాస్పద పరిస్థితులు ఉన్నప్పటికీ, దానిని ఇంకా హత్య కేసుగా పరిగణించలేదు. అందువల్ల, పోలీసుల దర్యాప్తులో లోపం జరిగిందని అంటున్నారు. కేసు దర్యాప్తు లోపభూయిష్టంగా ఉండటంతో అధికారులను సస్పెండ్ చేశారు.. ప్రస్తుతం, మరిన్ని వివరాలు, అనుమానాల నేపథ్యంలో, జూన్ 4న ఈ కేసును హత్య కేసుగా నమోదు చేశారు. ఇప్పుడు తలెత్తుతున్న పెద్ద ప్రశ్న ఏమిటంటే, చిన్నారి మరణంపై మొదటి నుంచీ సరైన దర్యాప్తు జరపాల్సిన అధికారులు దానిని సరిగ్గా చేపట్టలేదని అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో కడుగోడి పోలీస్ స్టేషన్ అప్పటి ఇన్‌స్పెక్టర్ రంగస్వామి, పీఎస్ఐ నింగరాజు, ఒక కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వారిపై శాఖాపరమైన స్థాయిలో తదుపరి విచారణ జరుపుతామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. అధికారులు ఎందుకు సకాలంలో చర్యలు తీసుకోలేదు, వారి ఉద్దేశం ఏమిటి, అది నిర్లక్ష్యమా లేక మరేదైనా కారణమా అనే విషయాలను పోలీసులు ఇప్పుడు వివరంగా పరిశీలిస్తున్నారు. ఈ కేసు తదుపరి విచారణను ఇప్పుడు మరో అధికారికి అప్పగించారు.

ప్రియాంక ఐవీఎఫ్ ద్వారా మరో బిడ్డను కనాలని ప్రణాళిక

ఈ కేసు వెనుక ఉన్న కుటుంబ సంబంధిత విషయం కూడా చర్చకు వచ్చింది. కడుగోడిలో తల్లి, ఆమె ప్రియుడు కలిసి ఆ బిడ్డను హత్య చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా, మరో ముఖ్యమైన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రియాంక అనే మహిళ తన ప్రియుడు మోహన్‌తో కలిసి ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) ద్వారా మరో బిడ్డను కనాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.మే 21న ప్రియాంక, మోహన్ కూడా ఆసుపత్రికి వెళ్లారు. ఆ రోజు ఐవీఎఫ్ ప్రక్రియ కోసం అండాల నమూనాలను కూడా సేకరించినట్లు రికార్డులు చూపిస్తున్నాయి. వారు మదర్‌వుడ్ ఆసుపత్రిలో ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కనబోతున్నారని డిశ్చార్జ్ సారాంశం రికార్డుల ద్వారా స్పష్టమయినట్లు అధికారులు తెలిపారు. కొత్త బిడ్డ కోసం ఐవీఎఫ్ ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే, బిడ్డ మరణాన్ని హత్య కేసుగా మార్చడం దర్యాప్తులో మరిన్ని అనుమానాలను రేకెత్తించింది. దీంతో, పోలీసులు ఇప్పుడు తల్లి, ఆమె ప్రియుడి ఉద్దేశాలు, వారి ప్రణాళిక, బిడ్డ హత్యకు, ఐవీఎఫ్‌కు మధ్య ఏమైనా సంబంధం ఉందా అనే విషయాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

దర్యాప్తు అధికారిగా ఏసీపీ అనూష..

ప్రస్తుతం, నిందితులు ఇద్దరూ పోలీసుల అదుపులో ఉన్నారు.. వారిని విచారిస్తున్నారు. చిన్నారి మరణానికి ఖచ్చితమైన కారణం, హత్య ఎప్పుడు, ఎలా జరిగింది, ఇందులో మరెవరైనా ప్రమేయం ఉందా, పోలీసుల మునుపటి నిర్లక్ష్యం వెనుక కారణం ఏమిటి అనే విషయాలపై దశలవారీగా దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో ఏ అధికారి తప్పునూ దాచిపెట్టబోమని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ ప్రకటనలో తెలిపారు.

# నాటోకు అమెరికా బిగ్ షాక్- యూరప్ నుంచి యుద్ధ విమానాలు, నౌకలు భారీగా తగ్గింపు!

దశాబ్దాల పాటు యూరప్ భద్రతకు అండగా నిలిచిన అమెరికా ఇప్పుడు సైనిక వ్యూహంలో కీలక మార్పులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా నాటో (చీూఊ) కార్యకలాపాల కోసం అమెరికా అందిస్తున్న యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు సహా నిఘా వ్యవస్థల్ని కూడా గణనీయంగా తగ్గించాలని వాషింగ్టన్ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఒకవైపు రష్యా నుంచి ముప్పు ఉన్న నేపథ్యంలో ఇప్పుడు ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ఐరోపా భద్రతా వ్యవస్థపైనే ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నాటో మిత్ర దేశాలకు అమెరికా అందిస్తూ వస్తున్న వైమానిక, నౌకాదళ మద్దతును తగ్గించనున్నట్లు తాజాగా 'ది న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది. ఇద్దరు ఐరోపా అధికారుల నుంచి సమాచారాన్ని ఉటంకిస్తూ ప్రచురించిన ఈ కథనం ప్రకారం, అమెరికా నిర్ణయం నాటో సైనిక సామర్థ్యాలపై ప్రత్యక్ష ప్రభావం చూపించనున్నాయి.



**భారీగా తగ్గనున్న యుద్ధ విమాన సంపద**

ప్రస్తుతం ఐరోపా రక్షణ కోసం అందుబాటులో ఉన్న సుమారు 150 వరకు ఖీ-16, ఖీ- 15జు యుద్ధ విమానాల సంఖ్యను 100కు తగ్గించాలని అమెరికా యోచిస్తోంది. అంటే సగానికి సగం తగ్గిస్తుందన్నమాట. ఇంకా సముద్ర నిఘా కోసం ఉపయోగించే విమానాల సంఖ్యను కూడా 26 నుంచి 15 కు కుదించనున్నట్లు కథనం పేర్కొంది. ఇక్కడ అత్యంత కీలకమైన ఏరియల్ రీఫ్యూయెలింగ్ ట్యాంకర్ జెట్లను కూడా పూర్తిగా ఉపసంహరించుకునే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యూరప్ దగ్గర ఇలాంటి 8 ట్యాంకర్లు అందుబాటులో ఉండగా వీటన్నింటినీ అమెరికా వెనక్కి తీసుకోనుంది.ఏరియల్ రీఫ్యూయెలింగ్ అంటే యుద్ధ విమానం గాలిలో ఉండగానే మరో యుద్ధ విమానం ట్యాంకర్ నుంచి ఇంధనం నింపుతారు. దీంతో యుద్ధ సమయాల్లో లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో కిందికి దిగకుండా ఎక్కువ సేపు ఆకాశంలోనే ఉండేందుకు ఇది సహాయపడుతుంది. అమెరికా తన క్షిపణుల్ని ప్రయోగించే సామర్థ్యం కలిగిన ఒక జలాంతర్గామి, ఒక విమాన వాహక నౌకతో పాటు మరికొన్ని యుద్ధ నౌకల్ని ఇతర ప్రాంతాలకు మళ్లించనున్నట్లు రిపోర్ట్ పేర్కొంది. ఐరోపా రక్షణ కోసం కేటాయించిన రెండు బాంబర్ దళాల్లో (బాంబర్ గ్రూప్స్) ఒకదానిని వెనక్కి తీసుకునే అవకాశం ఉంది.

**బలహీనంగా మారనున్న నాటో?**

ఒకవేళ నిజంగానే ఈ మార్పులు అమలైతే నాటో లాంగ్ రేంజ్ స్ట్రైక్స్ సహా నిఘా కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యం తగ్గొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ రష్యా జలాంతర్గాముల కదలికల్ని పర్యవేక్షించడం, అవసరమైతే దీర్ఘ శ్రేణి క్షిపణి దాడులు చేపట్టడం ఇకపై కష్టతరం కావొచ్చని భావిస్తున్నారు. యూఎస్ యూరోపియన్ కమాండ్ మాత్రం ఈ చర్యను పూర్తి స్థాయి ఉపసంహరణగా కాకుండా 'రైట్‌సైజ్'గా అభివర్ణించింది.నాటోలో అమెరికా బలగాలపైనే అధికంగా ఆధారపడటం అంత మంచిది కాదని, యూరప్ దేశాలు తమ రక్షణ బాధ్యతల్ని మరింతగా వారి భుజాన వేసుకోవాల్సిన సమయం వచ్చిందని వాదిస్తోంది. ఇంకా 2026 జాతీయ రక్షణ వ్యూహం, నాటో 3.ా విజన్‌లో భాగంగానే ఈ మార్పులు జరుగుతున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. ఐరోపా దేశాలు సహా కెనడా తమ రక్షణ వ్యయాల్ని పెంచి ఈ ప్రాంత భద్రతలో మరింత కీలక పాత్ర పోషించాలని అమెరికా కోరుతోంది.

నాటో అంటే నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్. కొన్ని యూరప్ దేశాలు, ఉత్తర అమెరికా దేశాల (అమెరికా, కెనడా) మధ్య ఏర్పడిన అంతర్జాతీయ సైనిక కూటమి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అప్పటి సోవియట్ యూనియన్ (రష్యా) నుంచి ఎదురయ్యే ముప్పును తిప్పికొట్టేందుకు, పశ్చిమ దేశాల రక్షణ కోసం అమెరికా నాయకత్వంలో ఈ కూటమి ఏర్పడింది. ఈ కూటమిలోని ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా, అది కూటమిలోని అన్ని దేశాలపై జరిగిన దాడిగా పరిగణించాలనేది నాటో ముఖ్య సూత్రం. ఒక్క మాటలో చెప్పాలంటే నాటో అనేది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైనిక కూటమిగా చెబుతుంటారు.

# ట్రంప్ సర్కార్‌కు భారీ ఊరట

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లపై అక్కడి ఫెడరల్ కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. సుంకాలపై చట్టపరమైన సవాళ్లు కోర్టులో కొనసాగుతున్నంత కాలం, ఫిబ్రవరిలో విధించిన 10శాతం సుంకాన్ని అమెరికా ప్రభుత్వం వసూలు చేయడాన్ని సమర్థించింది. ప్రపంచవ్యాప్తంగా దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ విధించిన 10 శాతం గ్లోబల్ సుంకాలను వసూలును కొనసాగించవచ్చని కీలక తీర్పునిచ్చింది.కాగా, గతేడాది ప్రపంచ దేశాలపై అమెరికా 10 శాతం సుంకాలను విధించింది. అయితే, అవి చెల్లవని ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం 2-1 తేడాతో తీర్పునిచ్చింది. దీంతో వాణిజ్య చట్టంలోని కొన్ని సెక్షన్లను ఉపయోగించి జులై 24 వరకు అమల్లో ఉండేలా తాత్కాలిక సుంకాలను ట్రంప్ విధించారు.ఈ నేపథ్యంలో రెండు వ్యాపార సంస్థలు ఇటీవల దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీంతో, అమెరికా రాజ్యాంగం ప్రకారం సుంకాలను నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టు స్పష్టం చేసింది. అధ్యక్షుడికి కాంగ్రెస్ కల్పించిన సుంకాల అధికార పరిధిని ట్రంప్ అతిక్రమించారని, ఆయన విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని తేల్చి చెప్పింది. అయితే, ట్రంప్ సర్కార్ ఈ విషయంపై అప్పీల్ చేయగా, న్యాయస్థానం వారికి అనుకూలమైన తీర్పు వెలువరించింది. కాగా, ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉంది.



**ప్రపంచ దేశాలపై సుంకాల మోత**

ఇదిలా ఉండగా, గతంలోనూ సుంకాలతో ట్రంప్ ప్రపంచ దేశాలపై విరుచుకుపడ్డారు. ఇరాన్‌తో వాణిజ్యం జరిపే అన్ని దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ గతంలో ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం కూడా, ఇతర దేశాల నుంచి ఎలాగైనా సుంకాలు వసూలుచేయాలని నిర్ణయించుకున్న ట్రంప్ సెక్షన్ 301 అధికారాన్ని ప్రయోగించారు. భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద, భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ పేర్కొన్నారు.

**ఈ చట్టం అధికారాలు ఏమిటంటే!**

ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉపయోగించే ఆయుధమే ఈ సెక్షన్ 301 తెలుస్తోంది. దీని ద్వారా, తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనే విషయంపై ఈ చట్టం కింద అగ్రరాజ్యం దర్యాప్తు చేసేందుకు వీలుంటుంది. ఈ దర్యాప్తు, అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. అయితే, ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే, ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునే విధంగా ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది.

**భారత్ వంటి మిత్రదేశంపైనా దర్యాప్తు చేపట్టడమా?**

అయితే, చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రదేశంపైనా దర్యాప్తు చేపట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ విధిస్తోన్న అధిక సుంకాలు, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది.

## నీట్ రీ ఎగ్జామ్‌లో మార్పులు- రఫ్ వర్క్ పేజీల రెట్టింపు- సమయాన్ని పెంచిన ఎన్‌టీఏ పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని వెల్లడి- రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వివరణ



: వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న నీట్ రీ ఎగ్జామ్ 2026లో జాతీయ పరీక్షల సంస్థ-చీూ కొన్ని మార్పులు చేసింది. ఈ నెల 21న దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరగనుండగా విద్యార్థుల సౌకర్యార్థం సమయాన్ని మరో 15 నిమిషాలు పొడిగించింది. ఈ నెల 21 మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల 15 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుందని చీూ ప్రకటించింది. మొత్తంగా ఈ పరీక్ష 195 నిమిషాల పాటు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. అభ్యర్థుల నుంచి గత కొన్నేళ్లుగా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ మార్పులు చేశామని చీూ తెలిపింది.

రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వెల్లడించింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ కోసం ఇప్పటివరకూ రెండు పేజీలు ఇస్తుండగా ఈసారి 4 పేజీలు ఇవ్వనున్నట్లు చీూ పేర్కొంది. ఎడమచేతి వాటం ఉన్న విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రశ్నపత్రం మొదట్లో, చివరిలో రెండేసి రఫ్ పేపర్లను ఏర్పాటు చేసినట్లు వివరించింది. గతంలో, రఫ్ వర్క్ పేజీలు కేవలం ప్రశ్నపత్రం బుక్‌లెట్ చివరలో మాత్రమే ఉండేవి. సవరించిన విధానం ప్రకారం, సూచనల పేజీ తర్వాత వెంటనే రెండు రఫ్ వర్క్ పేజీలు ఉంటాయి, అలాగే మరో రెండు అదనపు పేజీలు బుక్‌లెట్ చివరలో ఉంటాయి. ఈ కొత్త విధానం ప్రశ్నపత్రం ఇంగ్లీష్, ప్రాంతీయ భాషా వెర్షన్లు రెండింటిలోనూ ప్రవేశపెట్టారు.

"పరీక్ష ప్రారంభం, ముగింపులో ఉండే ఇన్విజిలేషన్ ప్రక్రియ (ఉదాహరణకు సంతకాలు చేయడం వంటివి) తమ అసలు పని సమయాన్ని తగ్గిస్తున్నాయని అభ్యర్థులు గతంలో భావించేవారు. ఆ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేలా సమయ వ్యవధిని రూపొందించాం. ఈ ప్రక్రియలతో సహా మొత్తం సమయాన్ని 195 నిమిషాలుగా నిర్ణయించాం. అభ్యర్థులు లెక్కలు, విశ్లేషణలు చేసుకోవడానికి వీలుగా ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్-వర్క్ కోసం కేటాయించిన పేజీల సంఖ్యను రెండు పేజీల నుంచి నాలుగు పేజీలకు పెంచాం. ఇప్పుడు బుక్‌లెట్‌లో ముందు, వెనుక భాగాల్లో రఫ్-వర్క్ పేజీలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ప్రతి అభ్యర్థి సౌకర్యవంతంగా పరీక్ష రాయవచ్చు. ముఖ్యంగా మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 10శాతం మంది ఉండే ఎడమ చేతి వాటం అభ్యర్థులకు ఇది ఎంతో సహాయపడుతుంది."

---నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ

"పరీక్షా విధానంలో చేసే చిన్న, ఆలోచనాత్మకమైన మార్పులు కూడా అత్యంత కీలకమైన పరీక్షా సమయంలో అభ్యర్థి సౌకర్యంలో గణనీయమైన మార్పును తీసుకురాగలవు. చీజుజు (ఖ+) 2026 పరీక్షను పారదర్శకంగా, సురక్షితంగా అభ్యర్థులకు అనుకూలమైన రీతిలో నిర్వహించడానికి, అలాగే ఈ పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా విధానాన్ని నిరంతరం మెరుగుపరచడానికి తమకున్న నిబద్ధతను చీూ పునరుద్ఘాటించింది." అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రతి సంవత్సరం పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా అనుభవాన్ని మెరుగుపరచడం కొనసాగిస్తామని ఏజెన్సీ చెప్పింది.వాస్తవానికి మే 3న నీట్ జరగ్గా పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించింది. దీంతో ఎన్‌టీఏ పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా దానిని రద్దుచేసి, జూన్ 21న మళ్లీ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది.

# రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ బుకింగ్ ఇక చాలా ఈజీ!

రైలు టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌లో ప్రయాణికులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే తెరపడనుంది. వెబ్‌సైట్ స్లోగా లోడ్ అవ్వడం, తత్కాల్ సమయంలో సర్వర్లు మొరాయించడం, పేమెంట్ ఫెయిల్యూర్స్ వంటి ఇబ్బందులను అధిగమించేందుకు భారతీయ రైల్వే సిద్ధమైంది. జులై 15 నాటికి భారీ మార్పులతో, అత్యంత వేగవంతమైన ఐఆర్‌సీటీసీ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త ప్లాట్‌ఫామ్ కోట్లాది మంది ప్రయాణికులకు సులభమైన, వేగవంతమైన టికెట్ బుకింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**విద్యార్థుల ఫిర్యాదుతో తక్షణ స్పందన**

జూన్ 11న జైపూర్‌లోని మాలవీయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్‌ఐటీ)లో విద్యార్థులతో జరిగిన ఒక సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకునేటప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను, ముఖ్యంగా తత్కాల్ సమయంలో వెబ్‌సైట్ క్రాష్ అవ్వడం, క్యాప్చా (జూూుజనూ) సమస్యలు, డబ్బులు కట్ అయినా టికెట్ కన్ఫర్మ్ కాకపోవడం వంటి అంశాలను విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన అశ్విని వైష్ణవ్, అక్కడికక్కడే రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కేవలం 30 రోజుల్లో కొత్త వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసే అవకాశంపై చర్చించారు. అనంతరం, జులై 15 కల్లా కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తామని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

**భారీగా పెరగనున్న సామర్థ్యం, కొత్త ఫీచర్లు**

ప్రస్తుతం భారతదేశంలో రైలు టికెట్లలో దాదాపు 88 శాతం ఆన్‌లైన్‌లోనే బుక్ అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (ూ=ూ) ను భారీగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. దీనివల్ల కీలకమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి.



బుకింగ్ సామర్థ్యం: ప్రస్తుతం నిమిషానికి సుమారు 32,000 టికెట్లు బుక్ చేసుకునే సామర్థ్యం ఉండగా, కొత్త వెబ్‌సైట్‌లో ఇది దాదాపు ఐదు రెట్లు పెరిగి నిమిషానికి 1.5 లక్షలకు పైగా చేరుకోనుంది.

విచారణ వేగం: రైళ్ల లభ్యత, వెయిటింగ్ లిస్ట్ వంటి వివరాల కోసం ప్రస్తుతం నిమిషానికి 4 లక్షల విచారణలు (వఅనబఱతీఱవం) సాధ్యం కాగా, ఇకపై ఇది పది రెట్లు పెరిగి 40 లక్షలకు పైగా చేరనుంది.

ఈ సాంకేతిక మార్పుల వల్ల పండుగలు, వేసవి సెలవులు, తత్కాల్ బుకింగ్ వంటి అత్యంత రద్దీ సమయాల్లోనూ సర్వర్లు మొరాయించడం, సీట్లు మాయమవడం వంటి సమస్యలు భారీగా తగ్గుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.వీటితో పాటు ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఇకపై టికెట్ బుక్ చేసుకునేటప్పుడే తమకు ఇష్టమైన సీటు లేదా బెర్త్‌ను ఎంచుకునే వెసులుబాటు (సీట్ ఛాయిస్ ఆప్షన్) కల్పించనున్నారు. ఇది కుటుంబాలు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుంది.

అలాగే, వివిధ తేదీల్లో ధరలను పోల్చుకునేందుకు 'ఫేర్ క్యాలెండర్', బహుళ ప్రాంతీయ భాషల్లో వెబ్‌సైట్‌ను ఉపయోగించుకునే సౌకర్యం, దివ్యాంగులు, విద్యార్థులు, రోగుల కోసం బుకింగ్ ప్రక్రియను సులభతరం చేసే సదుపాయాలను కూడా తీసుకురానున్నారు. ఈ మార్పులు కోట్లాది మంది రైలు ప్రయాణికులకు టికెట్ బుకింగ్ సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించి, ప్రయాణాన్ని మరింత సాఫీగా మారుస్తాయని ఆశిస్తున్నారు

# బంగారం ధరలు

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | ₹13,85,000 | ₹15,08,100 |
| ముంబయి | ₹13,81,000 | ₹15,06,600 |
| న్యూఢిల్లీ | ₹13,82,500 | ₹15,08,100 |



# వ్యాపారం

## పీఎఫ్ అకౌంట్ ఉందా..?

## దరఖాస్తు చేసుకోకుండానే అకౌంట్లోకి రూ.15 వేలు..



మీరు కొత్తగా ఏదైనా కంపెనీలో తొలిసారి ఉద్యోగంలో చేరుతున్నారా.. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేల సాయం పొందవచ్చు. ఈ మేరకు కేంద్రం కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. కొత్తగా ఉద్యోగాలు కల్పించేలా కంపెనీలను ప్రోత్సహించేందుకు కూడా ఈ పథకంలో మార్పులు చేశారు.మీరు మొదటిసారిగా ఉద్యోగంలో చేరారా..? అయితే మీకో గుడ్ న్యూస్. కంపెనీ మీకు ఇచ్చే జీతంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేల ఆర్థిక సాయం పొందవచ్చు. అవును.. ఎడ్యుకేషన్ పూర్తయిన తర్వాత ఉద్యోగంలో చేరినప్పుడు మొదటిసారి మాత్రమే ఈ సాయం అందిస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి ప్రోత్సాహకం అందించేందుకు కేంద్రం నగదు అందిస్తోంది. ఉద్యోగికే కాదు ఉద్యోగం కల్పించినందుకు కంపెనీకి కూడా కేంద్రం డబ్బులు అందిస్తోంది. ఈ పథకం పేరే ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన. ఈ పథకం అర్హతలు ఏంటి..? ఎవరెవరికి ఆర్థిక సాయం అందిస్తోంది? అనే వివరాలు ఇప్పుడు చూద్దాం.ప్రైవేట్ రంగంలో తొలిసారిగా ఉద్యోగంలో చేరే ప్రెషర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా రూ.15 వేల సాయం అందిస్తోంది. వీటిని నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తోంది. అయితే దీనికి కొన్ని విధివిధానాలు రూపొందింది. ఉద్యోగి పీఎఫ్ అకౌంట్ ఖచ్చితంగా కలిగి ఉండాలి. ఈపీఎఫ్‌వో ద్వారా ఈ పథకం అమలు చేస్తున్నారు. ఈపీఎఫ్‌వో కాంట్రిబ్యూట్ చేస్తూ ఉండాలి. దీని కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. మీరు తొలిసారి పీఎఫ్ అకౌంట్ తెరవగానే పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. అయితే రూ.15 వేలు ఒకేసారి అందించరు. ఉద్యోగం చేరి ఆరు నెలల పాటు పనిచేసిన తర్వాత తొలి విడత అందిస్తారు. ఆ తర్వాత 12 నెలల తర్వాత రెండో విడత సొమ్ము జమ చేస్తారు.ఉద్యోగం కల్పించినందుకు యజమానికి కూడా..2025, ఆగస్ట్ 1 నుంచి జులై 31,2027 మధ్య కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం అమలు కోసం కేంద్రం రూ.99,446 కోట్లు ఇప్పటికే కేటాయించింది.

## గ్గుతున్న బంగారం, వెండి ధరలు..

## కేంద్రం కీలక నిర్ణయం.. నేటి నుంచే అమల్లోకి..




బంగారం, వెండి విషయంలో కేంద్రం పెద్ద మార్పులు చేసింది. కనీస దిగుమతి ధరలను తగ్గించింది. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నేటి నుంచే తగ్గిన ధరలు అమల్లోకి వస్తాయని వెల్లడించింది. అంతర్జాతీయ పరిణామాల క్రమంలో బంగారం ధరలు ప్రభావితం అవుతున్నాయి.


బంగారం, వెండిపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోల్డ్, సిల్వర్ కనీస దిగుమతి ధరను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. 10 గ్రాముల బంగారపై కనీస దిగుమతి ధరను 80 డాలర్లకు తగ్గించగా.. ఇది 1343 డాలర్లకు చేరుకుంది. ఇక కిలో వెండి ప్రాథమిక దిగుమతి ధరను 276 డాలర్లు తగ్గించడంతో 2092కి చేరుకుంది. వీటి తగ్గింపుపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ నోటిఫై చేస్తూ ప్రకటన జారీ చేసింది. జూన్ 12వ తేదీ నుంచే ఈ సవరించిన ధరలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది. గతంలో 10 గ్రాముల బంగారంకు 1423గా ఉండేది. గత సుంకంతో పోలిస్తే 5.62 శాతం తగ్గిందని చెప్పవచ్చు.


వెండిపై కూడా తగ్గింపు

ఇక వెండి విషయానికొస్తే గతంలో కిలోకు సుంకం విలువ 2363 డాలర్లుగా ఉండేది. ఇప్పుడు 11.66 శాతం తగ్గించింది. అయితే ముడి పామాయిల్, ఆర్‌బిడి పామాయిల్, ముడి సోయాబీన్ నూనె వంటి ఇతర వస్తువుల సుంకాల విలువల్లో కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు. కేంద్రం అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా సుంకాల్లో మార్పులు చేస్తూ ఉంటుంది. అందులో భాగంగానే బంగారం, వెండి కనీసం దిగుమతి ధరల్లో మార్పులు చేసినట్లు ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల బంగారం ధరల్లో భారీ తగ్గుదల నమోదైన క్రమంలో కేంద్రం నుంచి ఈ ప్రకటన వచ్చింది. ప్రపంచ బులియన్ మార్కెట్లలో బంగారం ధరల్లో మార్పుల తర్వాత దిగుమతి ధరలను తగ్గించింది.

# క్రీడలు

## సెలక్టర్ల బిగ్ డెసిషన్.. టీమిండియాలోకి రాహుల్ ద్రావిడ్ చిన్న కుమారుడు.. !



రాహుల్ ద్రావిడ్ చిన్న కుమారుడు అన్వయ్ ద్రావిడ్ భారత్ అండర్-19 జట్టుకు ఎంపికయ్యాడు. శ్రీలంక పర్యటనలో వన్డే సిరీస్ ఆడనున్న అతడు వికెట్ కీపర్-బ్యాటర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. యువ క్రికెటర్‌గా అతని ప్రస్థానంపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

: భారత క్రికెట్ చరిత్రలో ది వాల్‌గా పేరుగాంచిన మాజీ కెప్టెన్, మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ చిన్న కుమారుడు అన్వయ్ ద్రావిడ్ సరికొత్త రికార్డు సృష్టించాడు. జూలై 4 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటన కోసం భారత అండర్-19 క్రికెట్ జట్టును సెలెక్టర్లు ప్రకటించారు. ఎస్.శరత్ నేతృత్వంలోని జూనియర్ సెలక్షన్ కమిటీ ప్రకటించిన ఈ జట్టులో 17 ఏళ్ల అన్వయ్ ద్రావిడ్‌కు చోటు దక్కింది. ఈ పర్యటనలో భాగంగా భారత జట్టు లంకతో మూడు వన్డేలు, రెండు మల్టీ-డే (లిస్ట్-ఏ) మ్యాచ్‌లు ఆడనుంది. ఈ రెండు జట్లకు యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

ప్రస్తుతం 17 సంవత్సరాల 45 రోజుల వయసు ఉన్న అన్వయ్ ద్రావిడ్‌ను వైట్ బాల్ (వన్డే) సిరీస్ కోసం సెలెక్టర్లు ఎంపిక చేశారు. అన్వయ్ జట్టులో మిడిలార్డర్ బ్యాటర్‌గా రాణించడంతో పాటు వికెట్ కీపింగ్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించగలడు. గత అండర్-19 ప్రపంచకప్‌కు ముందు జరిగిన సన్నాహక టోర్నీల్లో కూడా అన్వయ్ భారత్ బ్లూ జట్టు తరఫున త్రైపాక్షిక సిరీస్‌లో భాగమయ్యాడు. అయితే అప్పట్లో అతనికి కేవలం ఒక్క మ్యాచ్‌లోనే ఆడే అవకాశం వచ్చింది. ఇప్పుడు వయసు, ఫామ్ అనుకూలంగా ఉండటంతో తదుపరి అండర్-19 ప్రపంచకప్ సైకిల్‌ను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు అతనికి ఈ మెగా ఛాన్స్ ఇచ్చారు.గతేడాది జరిగిన ప్రతిష్టాత్మక వినూ మన్కడ్ ట్రోఫీలో అన్వయ్ ద్రావిడ్ తన అద్భుత కెప్టెన్సీతో కర్ణాటక జట్టును క్వార్టర్ ఫైనల్స్ వరకు తీసుకెళ్లాడు.

## ఈసారి 10 కాదు, ఏకంగా 14 జట్లు.. 2027 వన్డే వరల్డ్ కప్ డేట్స్ వచ్చేసాయ్!




: క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మెగా టోర్నీ.. ఐసీసీ పురుషుల వన్డే వరల్డ్ కప్‌కు సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చేసింది. 2027లో జరగబోయే ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ తాత్కాలిక తేదీలు, వేదికలను ఐసీసీ సిద్ధం చేసింది. ఇఎస్పిఎన్ క్రిసిన్ఫో నివేదిక ప్రకారం.. ఈ మెగా టోర్నీ 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు నిర్వహించేలా షెడ్యూల్ ఖరారైంది. గత మే నెలలో అహ్మదాబాద్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ తేదీలపై ప్రాథమిక అంగీకారం కుదిరింది. దీనిపై పూర్తి స్థాయి అధికారిక ముద్రను ఈ జూలైలో ఎడిన్‌బర్గ్‌లో జరగబోయే ఐసీసీ వార్షిక జనరల్ మీటింగ్‌లో వేయనున్నారు.

**మూడు దేశాల్లో వేదికలు.. సౌతాఫ్రికాలోనే ఎక్కువ**

ఈ 2027 వన్డే ప్రపంచకప్‌కు బహుళ దేశాలు ఆతిథ్యం ఇస్తున్నాయి. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. మొత్తం జరగబోయే 54 మ్యాచ్‌లలో ఎక్కువ మ్యాచులు సౌతాఫ్రికాలోనే జరగనున్నాయి. అక్కడ కనీసం 8 వేర్వేరు వేదికలలో 41 మ్యాచ్‌లను ప్లాన్ చేశారు. ఇక జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్, బులవాయోలోని క్వీన్స్ క్లబ్, విక్టోరియా ఫాల్స్ సహా 3 వేదికల్లో 8 నుంచి 10 మ్యాచ్‌లు జరగనున్నాయి. మిగిలిన మూడు మ్యాచ్‌లకు నమీబియా ఆతిథ్యం ఇవ్వనుంది. 2003 తర్వాత ఆఫ్రికా ఖండంలో జరుగుతున్న మొదటి పురుషుల వన్డే వరల్డ్ కప్ ఇదే కావడం విశేషం.

**జింబాబ్వేలో కొత్త స్టేడియం.. వాయిదా పడ్డ ఓపెనింగ్**

ఈ మెగా టోర్నీ కోసం జింబాబ్వే ప్రభుత్వం విక్టోరియా ఫాల్స్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా సరికొత్త ఫేల్ మోసి-ఓ-తున్యా ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తోంది. ఈ మైదానంలో ఈ ఏడాది కొన్ని లోకల్ మ్యాచ్‌లను నిర్వహించి, వచ్చే ఏడాది మే నెలలో అధికారికంగా ప్రారంభించనున్నారు. నిజానికి ఈ ఏడాది ఆగస్టులో సౌతాఫ్రికా జట్టు జింబాబ్వేలో పర్యటించి ఈ ఇంటర్నేషనల్ స్టేడియాన్ని ప్రారంభించాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల ఆ పర్యటన ప్రస్తుతానికి వాయిదా పడింది.

**మారుతున్న వరల్డ్ కప్ ఫార్మాట్.. 14 జట్లతో సమరం**

గత రెండు ప్రపంచకప్‌లలో (2019, 2023) కేవలం 10 జట్లే బరిలోకి దిగగా, ఈసారి ఐసీసీ పాత ఫార్మాట్‌ను మళ్లీ తెరపైకి తెచ్చింది. 2027 టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీ పడనున్నాయి. ఈ 14 జట్లను గ్రూప్‌నకు ఏడు చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. లీగ్ దశ ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్ నుండి టాప్-3 స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్ దశకు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలు, ఐసీసీ ఫుల్ మెంబర్స్ అయినందున సౌతాఫ్రికా, జింబాబ్వేలు ఈ టోర్నీకి నేరుగా క్వాలిఫై అయ్యాయి. అయితే మరో హోస్ట్ కంట్రీ అయిన నమీబియా మాత్రం ఐసీసీ క్వాలిఫైయర్ మ్యాచ్‌లు ఆడి గెలిస్తేనే మెగా టోర్నీలో అడుగుపెట్టే అవకాశం ఉంటుంది.

**టెస్ట్ ఛాంపియన్‌షిప్ పైనా ఐసీసీ కీలక చర్చలు**

ఈ 2027 వన్డే వరల్డ్ కప్ అనేది 2027-2031 ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ కింద జరగబోయే మొదటి ఐసీసీ ఈవెంట్. ఈ ఎఫ్‌టీపీ కింద ద్వైపాక్షిక సిరీస్‌ల షెడ్యూల్‌ను కూడా ఐసీసీ సిద్ధం చేస్తోంది. దీంతో పాటు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔఠ) ఫార్మాట్‌ను విస్తరించడంపై కూడా ఐసీసీ అంతర్గత చర్చలు జరుపుతోంది.

# ఎయిరిండియా ఘోర ప్రమాదానికి ఏడాది.. ఇంకా వీడని మిస్టరీ.. నివేదికపై ఉత్కంఠ..

ఎయిరిండియా ఘోర ప్రమాదానికి ఏడాది.. ఇంకా వీడని మిస్టరీ.. నివేదికపై ఉత్కంఠ.. టేకాఫ్ అయిన కేవలం మూడు సెకన్లు.. కాక్‌పిట్‌లో అనూహ్యంగా రెండు ఫ్యూయల్ స్విచ్‌లు ఆఫ్ అయిపోయాయి.. ఇంజన్లకు ఇంధనం నిలిచిపోయింది. మరో 30 సెకన్లలో భారీ బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం ఒక మెడికల్ హాస్టల్‌పై కుప్పకూలడంతో 260 మంది ప్రాణాలు కోల్పోయారు. భారత ఏవియేషన్ చరిత్రలోనే బ్లాక్ డేగా మిగిలిన ఎయిర్ ఇండియా 171 ఘోర విమాన ప్రమాదం జరిగి నేటికి సరిగ్గా ఏడాది.“మేడే.. మేడే.. మేడే..”సరిగ్గా ఏడాది క్రితం.. 2025 జూన్ 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ రన్‌వే నుండి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా 171 విమాన పైలట్ నుండి వచ్చిన ఆఖరి ఆర్తనాదం ఇది. టేకాఫ్ అయిన కేవలం మూడు సెకన్లలోనే కాక్‌పిట్‌లోని రెండు ఫ్యూయల్ స్విచ్‌లు ఆగిపోయి, ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయింది. మరో ముప్పై సెకన్లలో ఆ భారీ విమానం సమీపంలోని మెడికల్ హాస్టల్ కాంప్లెక్స్‌పై కుప్పకూలింది. ఈ దారుణ ఉదంతంలో 260 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. విమానంలో ఉన్న 242 మందిలో కేవలం ఒక్కరంటే ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడగా, భూమిపై ఉన్న మరో 19 మంది అమాయకులు బలయ్యారు. 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో సంభవించిన ఆ అగ్నిప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోవడంతో, గుర్తింపు ప్రక్రియకు వారాల తరబడి ఐచీూ పరీక్షలు చేయాల్సి వచ్చింది. 1996 నాటి చర్ఖీ దాద్రి ప్రమాదం తర్వాత భారతదేశంలో జరిగిన అత్యంత ఘోరమైన విమాన విపత్తు ఇదే. నేడు ఈ దారుణ ఘటన జరిగి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఈ ప్రమాదం వెనుక ఉన్న అసలు రహస్యంపై అంతర్జాతీయ ఏవియేషన్ రంగంలో ఉత్కంఠ రేపుతోంది.

**రెండు పీడకలల సిద్ధాంతాలు**

గడిచిన ఏడాది కాలంగా ఎయిర్ ఇండియా 171 ప్రమాదం రెండు ప్రధాన సిద్ధాంతాల చుట్టూ తిరుగుతోంది. ఈ రెండూ కాక్‌పిట్‌లోని ఆ రెండు ఫ్యూయల్ కటాఫ్ స్విచ్‌ల కదలికతోనే ముడిపడి ఉన్నాయి.

**మొదటిది – మానవ తప్పిదం :**

టేకాఫ్ అయిన వెంటనే పైలట్లలో ఎవరో ఒకరు ఉద్దేశపూర్వకంగానో లేదా పొరపాటునగానో ఆ ఫ్యూయల్ స్విచ్‌లను ఆపేశారనేది ఒక వాదన. సాధారణంగా ఈ స్విచ్‌లు రక్షణ కవచంతో ఉండి అంత సులభంగా ఆపడానికి వీలుండదు. కాబట్టి ఇందులో మానవ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

**రెండూ – సాంకేతిక లోపం:**

అత్యాధునిక బ్యాకప్ సిస్టమ్స్ ఉన్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో తీవ్రమైన ఎలక్ట్రికల్ లేదా మెకానికల్ లోపం తలెత్తి, అత్యంత కీలకమైన సమయంలో ఇంధన సరఫరాను నిలిపివేసిందనేది రెండో వాదన.

**ప్రాథమిక నివేదిక వెల్లడించిన షాకింగ్ నిజాలు**

గతేడాది జూలై 12న లీకైన ప్రాథమిక నివేదిక ప్రకారం.. టేకాఫ్ అయిన మూడు సెకన్లలోనే ఇంజన్ 1, ఇంజన్ 2 ఫ్యూయల్ స్విచ్‌లు కేవలం ఒక సెకను వ్యవధిలో =ఖచీ నుండి జఖుూఖీఖీ మోడ్‌లోకి మారిపోయాయి. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలట్ “నువ్వు స్విచ్‌లు ఎందుకు కట్ చేసావ్?” అని అడగగా.. రెండో పైలట్ “నేను చేయలేదు” అని సమాధానం ఇచ్చినట్లు రికార్డ్ అయింది. ఆ తర్వాత స్విచ్‌లను మళ్లీ =ఖచీ మోడ్‌లోకి తెచ్చినప్పటికీ, అప్పటికే విమానం వేగాన్ని, ఎత్తును కోల్పోయి కూలిపోయింది.

**రంగంలోకి బోయింగ్.. కొత్త ట్విస్ట్‌లు**

ఈ ప్రమాదం అమెరికాకు చెందిన విమాన తయారీ దిగ్గజం బోయింగ్, ఎయిర్ ఇండియా ప్రతిష్టలను పణంగా పెట్టింది. ఒకవేళ పైలట్ తప్పిదమైతే చనిపోయిన పైలట్లను సమర్థించుకునేవారు లేరు. అదే సాంకేతిక లోపమైతే బోయింగ్ సంస్థ బిలియన్ల డాలర్ల నష్టపరిహారంతో పాటు వందలాది డ్రీమ్‌లైనర్ విమానాలను నిలిపివేయాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో కొన్ని నెలల క్రితం లండన్–బెంగళూరు రూట్‌లో వెళ్తున్న మరో ఎయిర్ ఇండియా 787 విమానంలో కూడా ఇలాంటి ఫ్యూయల్ స్విచ్ లాచ్ సమస్య తాత్కాలికంగా తలెత్తడం ఈ అనుమానాలకు మరింత బలాన్నిచ్చింది. ప్రస్తుతం ఆ విమాన స్విచ్ యూనిట్‌ను భారత ఏవియేషన్ నిపుణుల సమక్షంలో పరీక్షించడానికి అమెరికాలోని బోయింగ్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. గతంలో బోయింగ్ 737 హీూశ విమానాల కంట్రోల్ సాఫ్ట్‌వేర్ వివాదంలో బోయింగ్ ప్రవర్తనను గుర్తుచేస్తూ చాలా మంది నిపుణులు సాంకేతిక లోపం వైపే మొగ్గు చూపుతున్నారు.









**రెండు ప్రమాదాల గుణపాఠాలు**

భారతదేశానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఈ దర్యాప్తును నడిపిస్తోంది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం ఏడాది పూర్తయిన సందర్భంగా ❝ూా×దీ ఈరోజు తుది నివేదికను గానీ, లేదా తాత్కాలిక పురోగతి నివేదికను గానీ సమర్పించాల్సి ఉంది. అయితే చరిత్రలో మిగిలిపోయిన రెండు ప్రమాదాలు మనకు హెచ్చరికలుగా నిలుస్తున్నాయి.

చైనా ఈస్టర్న్ ఫ్లైట్ 5735 (2022): ఈ ప్రమాదం జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా చైనా పూర్తి నివేదిక ఇవ్వకుండా దాటవేస్తోంది. ఇటీవల అమెరికా చీూదీ డేటా లీక్ చేస్తూ అది పైలట్ చర్యేనని చెప్పే వరకు అసలు విషయం బయటకు రాలేదు. నిశబ్దం అనేది దర్యాప్తును నిర్వీర్యం చేస్తుందనడానికి ఇది ఉదాహరణ.ఈజిప్ట్ ఎయిర్ ఫ్లైట్ 990 (1999): అమెరికా దర్యాప్తు సంస్థ ఇది పైలట్ ఆత్మహత్య అని చెబితే, ఈజిప్ట్ ప్రభుత్వం దాన్ని తిరస్కరించి యాంత్రిక లోపమని వాదించింది. ఇలాంటి పరస్పర విరుద్ధ ముగింపులు ఏవియేషన్ రంగానికి పెద్ద శాపాలు.ఎయిర్ ఇండియా 71 ప్రమాదానికి కారణం మానవ తప్పిదమైతే పైలట్ల మానసిక ఆరోగ్యం, కాక్‌పిట్ నిబంధనలపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సాంకేతిక లోపమైతే వందలాది బోయింగ్ విమానాల రీ డిజైనింగ్ చేయాల్సి వస్తుంది. కారణం ఏదైనా కావచ్చు, విమాన ప్రయాణాల భద్రత అనేది ఎప్పుడూ కఠినమైన నిజాల పైనే నిర్మించబడుతుంది. ఈ వార్షికోత్సవం వేళ, బాధితుల కుటుంబాలకు కావాల్సింది ఊహాగానాలు కావు.. నిజమైన, పారదర్శకమైన సమాధానం.

## 5,300 ఏళ్ల నాడు తిన్న తిండి..

# ఇంకా అరుగుతూనే ఉంది

సుమారు 5,300 ఏళ్ల క్రితం ఇటాలియన్ ఆల్ప్స్ పర్వతాల్లో బాణం దాడిలో హత్యకు గురైన ప్రాచీన మానవుడు ‘ఓట్జీ ఐస్‌మ్యాన్’ కథలో శాస్త్రవేత్తలు ఒక అబ్బురపరచే వాస్తవాన్ని కనుగొన్నారు. వేల ఏళ్లుగా అతని శరీరం మంచులో పడి గడ్డకట్టుకుపోయినా.. అతని శరీరంలోని సూక్ష్మజీవుల ప్రపంచం మాత్రం ఇంకా సజీవంగా, చురుగ్గా పనిచేస్తోందని పరిశోధకులు గుర్తించారు. యూరప్‌లోనే అత్యంత ప్రసిద్ధమైన ఈ మమ్మీ కడుపులో ప్రాచీన బ్యాక్టీరియా, చలిని తట్టుకునే ఈస్ట్ జాతులు ఇప్పటికీ జీవక్రియలను కొనసాగిస్తున్నాయని ‘మైక్రోబయోమ్’ జర్నల్ తాజా అధ్యయనంలో వెల్లడించింది. మంచు నదులు ఘనీభవించడంతో 5300 ఏళ్ల క్రితం ఓట్జీ చనిపోయాడు. మంచులోనే వేల ఏళ్ల పాటు భద్రంగా ఉన్న అతని దేహం 1991లో ఆస్ట్రియా– ఇటలీ సరిహద్దులోని ఓట్జ్‌టల్ ఆల్ప్స్ పర్వత ప్రాంతంలో లభించింది. ఓట్జీ ఎడమ భుజంలో బాణం దిగబడి ఉండటం, ఇతర గాయాలు ఉండటం వల్ల ఎవరో ఆయనను హత్య చేసినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. పలు పరిశోధనల ద్వారా ఆ మనిషి జీవితం, ఆహారపు అలవాట్లను తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు అనేక విషయాలు కనుగొన్నారు. ఇటలీకి చెందిన యూరాక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన పరిశోధకుడు మహమ్మద్ సర్వాన్ నేతృత్వంలోని బృందం ఓట్జీ చర్మం, కణజాలాలను విశ్లేషించి ఆశ్చర్యకరమైన విషయాలను వెలుగులోకి తెచ్చింది. ఓట్జీ చనిపోయే ముందు అడవి గొర్రె, ఎరుపు జింకల మాంసం, ముతక గోధుమలు, అడవి చెట్ల ఆకులు తిన్నాడని, అతని కడుపులోని బ్యాక్టీరియా ఇప్పటికీ జీర్ణం చేసే పనిలోనే నిమగ్నమై ఉంది. ఆధునిక పట్టణవాసుల్లో పూర్తిగా అంతరించిపోయి, ప్రస్తుతం కేవలం ఆఫ్రికా, అమెరికా మారుమూల గిరిజనుల్లో మాత్రమే ఉన్న ‘రోంబౌట్సియా హోమినిస్’ వంటి అరుదైన బ్యాక్టీరియా ఓట్జీ శరీరంలో నేటికీ సజీవంగా ఉంది. ఓట్జీ శరీరాన్ని మైనస్ 6 డిగ్రీల వద్ద భద్రపరిచేందుకు మ్యూజియం సిబ్బంది వాడే ‘ఫినాల్’ క్రిమిసంహారక రసాయనాలనే అక్కడి ఈస్ట్ జాతులు ఆహారంగా మార్చుకుని గత తొమ్మిదేళ్లుగా వృద్ధి చెందడం శాస్త్రవేత్తలను విస్మయానికి గురిచేసింది. ఈ ఆవిష్కరణ ఒకవైపు మానవ ఆరోగ్యం, వ్యాధుల పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి అమూల్యమైన సమాచారాన్ని అందిస్తుండగా.. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మ్యూజియంల పరిరక్షణ విధానాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గడ్డకట్టే చలిని, ఆధునిక రసాయనాలను తట్టుకుని ఈ సూక్ష్మజీవులు బతికేస్తుంటే, పురాతన సంపదను లోపలి నుంచే అవి నాశనం చేయకుండా ఎలా కాపాడాలనేది ఇప్పుడు పరిశోధకులకు పెద్ద సవాల్‌గా మారింది.



Printed, Published and Owned by J BHASKER, and Printed at Sunday Printing Press, H.No.361, Bhagyalaxmi Colony, Quthbullapur, MEDCHAL MALKAJGIRI, Telangana- 500054. and Published from H.No.3-87, Gangaram, Marepalli, Kondapur, SANGAREDDY, TELANGANA - 502306.. Editor: J BHASKER. PRGI NO : TGTEL/25/A3369 Email: samastaprakshalanam@gmail.com. Phone No: 9959479375, 9398191920.